RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశం

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 229 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి మంగళవారం 18-8-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, దక్షిణాయణం, గ్రీష్మరుతువు,శ్రావణ మాసం, తిథి॥ షష్ఠి రా॥7.27, చిత్ర ఉ॥7.43, వర్జ్యం మ॥ 1.39-3.21,
దుర్ముహూర్తం ఉ॥ 8.15-9.06, శుభ సమయం మ॥ 12.00-1.30, రాహుకాలం మ॥ 3.00-4.30, సూర్యోదయం ఉ॥ 5.45, సూర్యాస్తమయం సా॥ 6.26 గం॥

## నాలుగురోజుల పాటు అసెంబ్లీ

### 19న గ్రూప్-1 అక్రమాలపై చర్చ



**అమరావతి,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** నాలుగు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. సోమవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం జరిగింది. ఇందులో సమావేశాల షెడ్యూల్‌ను ఖరారు చేశారు. మంగళవారం బీసీ రిజర్వేషన్ నివేదిక ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. మొత్తం 9 ఆర్డినెన్స్‌లను బిల్లుల రూపంలో ప్రవేశపెట్టాలని బీఏసీలో తీర్మానించారు. 19న గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్ 1పై అసెంబ్లీలో చర్చ పెట్టాలని బీఏసీలో నిశ్చయించారు. అన్ని అంశాలపై చర్చ జరపాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి సీఎం చంద్రబాబు, మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, చీఫ్ విప్ ఆంజనేయులు హాజరయ్యారు.

# డిఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు!

**-నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే -డీఎస్సీపై వైసీపీవి హిట్ అండ్ రన్ చర్యలు**

**-ఒడిశా కూలీలు, 90 ఏళ్ల జగన్ జెన్జీలతో ఫేక్ ప్రదర్శనలు -ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని వైసీపికి సవాల్**

**-శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై సీఎం చంద్రబాబు ప్రసంగం**

**అమరావతి, ఆగస్టు 17 (ఆర్ఎన్ఏ):** మెగా డీఎస్సీ నియామకాల్లో ఎక్కడా డీవియేషన్ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ పారదర్శకంగా ఆన్ లైన్‌లోనే ఉంచామన్నారు. వైసీపీ నేతలు హిట్ అండ్ రన్ చర్యలతో దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. డీఎస్సీ నియామకాల అంశంపై శాసనసభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా విద్యార్థులు తయారవుతారని మేం విశ్వసించాం. దానికి అనుగుణంగానే చర్యలు తీసుకున్నాం. ఐటీని ప్రోత్సహించటం ద్వారా టెక్నాలజీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మానవ వనరుల్ని తయారు చేశాం. విద్య రంగాన్ని తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించింది. రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా నాడు ఎన్టీఆర్ సంస్కరణలు తెచ్చారు. మహిళలకు ఉన్నత విద్యావకాశాలు కల్పించేందుకు మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసింది మొదట ఎన్టీఆరే. నేను సీఎం అయిన తొలినాళ్లలోనే ఉమ్మడి రాష్ట్రంలో పాఠశాల లేకపోవటంపై తక్షణ చర్యలు తీసుకున్నాం. ప్రతీ కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, ప్రతీ మండలానికి ఓ జూనియర్ కాలేజి, ఇంజనీరింగ్ కాలేజీ, జిల్లాకు మెడికల్ కాలేజిని ఏర్పాటు చేశాం. విద్యా ప్రమాణాలు పెంచితేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఉపాధ్యాయుల నియామకాలు చేయని 2019-24 మధ్య ఉన్న పాలకులు విద్యారంగంపై డబ్బాలు కొట్టుకున్నారు. ఇప్పటి వరకూ 14 డీఎస్సీలు జరిగితే, టీడీపీ, ఎన్డీయే హయాంలో 11 డీఎస్సీల ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం. ఇంత వరకూ అవినీతి జరిగిందని ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు. పాఠశాలలకు



విద్యార్థుల హాజరు పెంచాలనే లక్ష్యంతో గతంలో డ్రై రేషన్ కూడా అందించాం. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా రాష్ట్రంలో నాడు టీడీపీనే ప్రవేశపెట్టింది. ఇంటర్ విద్య వరకూ ఈ పథకాన్ని విస్తరించాం. మహిళలకు విద్యలో కూడా రిజర్వేషన్ కల్పించేలా నిర్ణయం తీసుకున్నాం. ఉపాధ్యాయుల బదిలీని పారదర్శకంగా చేసేందుకు ప్రత్యేకంగా ఓ చట్టమే తీసుకువచ్చాం. గడచిన 30 ఏళ్లుగా విద్యారంగంలో వినూత్న సంస్కరణల ద్వారా మార్పులు తెచ్చాం. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఐఐటీ, ఐఐఎం లాంటి విద్యా సంస్థలు సహా పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. 2019-24 మధ్య 10-12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు రావటం మానేశారు. అందుకే తల్లికి వందనం పేరిట పిల్లలందరికీ ఆర్థికసాయం అందించేలా మేం నిర్ణయం తీసుకుని అమలు చేశాం. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచటంతో 1 లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు వచ్చారు. "అని ముఖ్యమంత్రి అన్నారు.

**డీఎస్సీ నియామక ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే**

"గత పాలకులు 5 ఏళ్ల పాటు ఒక్క టీచర్ నియామకాన్ని కూడా చేపట్టలేదు. మేం అధికారంలోకి వస్తూనే తొలి సంతకం చేసి మెగా డీఎస్సీతో 15,941 ఉద్యోగాలను భర్తీ చేశాం. కేవలం 148 రోజుల్లోనే ప్రక్రియ అంతా పారదర్శకంగా పూర్తి చేసి నియామకాలు పూర్తి చేశాం. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు సహా హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియను కట్టుదిట్టంగా చేపట్టాం. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నల్ని ఎంపిక చేసి అత్యుత్తమ విధానంలో పరీక్ష నిర్వహించాం. 154 సెంటర్లలో పరీక్షలు సీబీటీ విధానంలో చేపట్టి ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశాం. పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేసి నియామకాలు చేశాం. జోనల్, రాష్ట్రస్థాయి కమిటీతో పాటు అప్పిలేట్ అథారిటినీ కూడా పెట్టి ఫిర్యాదులను పరిష్కరించాం. స్పోర్ట్స్ కోటా కింద కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నిబంధనల్నే అమలు చేశాం. ఉద్యోగాలు వచ్చిన వారంతా అత్యుత్తమ ప్రతిభ కలిగిన వ్యక్తులు, ఎంతో కష్టపడి ఉద్యోగం సంపాదించుకున్నారు. మెగా డీఎస్సీ ద్వారా తమ కష్టానికి ఫలితం దక్కిందని టీచర్లు చెప్పారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే రిజల్ట్స్ ఇచ్చాం. ఎంపిక ప్రక్రియ అంతా ఆన్ లైన్‌లోనే ఉంది. ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుంది.? ప్రభుత్వంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఓ ఐఎఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. నోటిఫికేషన్‌లో నియామక

మిగతా 2లో..

## ఎన్‌టిఎ తప్పులకు విద్యార్థుల మూల్యం

**-సోషియాలజీ, ఇంగ్లీష్ పరీక్షల రద్దు దారుణం**

**-మండిపడ్డ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీరుపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోమారు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూజీసీ-నెట్ పరీక్షల్లో సోషియాలజీ, ఇంగ్లీష్, కామర్స్ పరీక్షలను రద్దు చేసి సెప్టెంబర్‌లో మళ్లీ నిర్వహించాలని ఎన్‌టీఏ నిర్ణయించడంపై రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. ఎన్‌టీఏ తప్పులకు వేలాది మంది విద్యార్థులు మూల్యం చెల్లించాల్సి వస్తోందని విమర్శించారు. ఎక్స్ వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ.. 'మోదీజీ.. మీ ఎన్‌టీఏ ఏం చేసిందో చూడండి. జూన్ 22 నుంచి 30 వరకు సోషియాలజీ, ఇంగ్లీష్, కామర్స్ యూజీసీ-నెట్ పరీక్షలు జరిగాయి. దాదాపు రెండు నెలల తర్వాత ప్రశ్నపత్రాల్లో లోపాలు, గత ప్రశ్నల పునరావృతం కారణంగా ఈ మూడు పరీక్షలను ఎన్‌టీఏ రద్దు చేసింది. ఎన్‌టీఏ నిర్ణయం వల్ల ఏళ్ల తరబడి పరీక్షకు సిద్ధమైన వేలాది మంది అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడం, ఫీజులు చెల్లించడం, దూర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు ప్రయాణించాల్సి వస్తోంది. తప్పు చేసింది ఎన్‌టీఏ.. కానీ, శిక్ష అనుభవించేది మాత్రం విద్యార్థులా?' అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షా వ్యవస్థ విద్యార్థులను దోపిడీ చేసే వ్యవస్థగా మారిందని రాహుల్ ఆరోపించారు. దేశంలో సరైన పరీక్షా వ్యవస్థ లేదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్‌లలో ఇదే విషయాన్ని ప్రస్తావించానన్నారు. 'ఇది విద్యా వ్యవస్థ కాదు.. డబ్బు, కాలం, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని తీసుకుని చివరికి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని

మిగతా 2లో..

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్సీ నాగబాబు



**అమరావతి,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** ఏపీ గ్రీనింగ్, 'రీఫారెస్టేషన్' కార్యక్రమాల నిర్వహణపై ప్రభుత్వ కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రబాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పర్యావరణ, అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జీవో ఆర్టీ నంబర్ -93 ద్వారా ఈ నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ గ్రీన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనం, అడవుల విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా ఆయా కార్యక్రమాలను అమలు చేయనుంది.



## భోగాపురం ఎయిర్‌పోర్టుకు తొలి విమానం రాక

**ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు**

**అమరావతి,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** భోగాపురం అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులు ప్రారంభం కావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. చరిత్రాత్మక ఘట్టానికి భోగాపురం వేదికైందన్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో నేటి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. హైదరాబాద్ నుంచి తొలి ఇండిగో విమానం భోగాపురం విమానాశ్రయానికి చేరుకుందన్నారు. తొలి విమానం రాకతో ఏపీ.. కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఉత్తరాంధ్రకు మెరుగైన విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం.. రాష్ట్రంలో కొత్త అవకాశాలకు బాటలు వేస్తోందని సీఎం చెప్పుకొచ్చారు. యువత ఆశలు, ఆకాంక్షలకు ఈ విమానాశ్రయం రెక్కలు తొడుగుతుందని.. విద్య, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలకు మరింత ఊతమిస్తుందన్నారు.

## గిరిజనులను భయపెట్టేందుకు ప్రతిపక్షం అబద్ధపు ప్రచారం

**-1/70 చట్టం రద్దు చేస్తామనడం పూర్తిగా అవాస్తవం**

**-గిరిజనుల భూములను కాపాడటం ప్రభుత్వ బాధ్యత**

**-మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**



**అమరావతి ఆగష్టు,17(ఆర్ఎన్ఏ):** గిరిజనుల భూముల రక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మరియు స్త్రీ ,శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. 1/70 చట్టాన్ని రద్దు చేస్తామంటూ ప్రతిపక్షం చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. గిరిజనులను మభ్యపెట్టి, భయపెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి మాట్లాడుతూ.. గిరిజనుల భూ సంరక్షణ కోసం అమల్లో ఉన్న 1/70 చట్టాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. గిరిజనులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, వారి భూములకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అసెంబ్లీలో గిరిజనుల సమస్యలపై ప్రశ్నలు వేసి, సమాధానాలు వినేందుకు

మిగతా 2లో..

## అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహణ

**-డిఎస్సీ అంటే అర్థం తెలియని వారి అర్థ రహిత విమర్శలు**

**-ఇక నుంచి ఏటా ఉపాధ్యాయ నియామకాలు**

**-అసెంబ్లీలో డిఎస్సీపై నిర్వహణపై మంత్రి లోకేశ్ వివరణ**



**అమరావతి,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** డీఎస్సీ నిర్వహణ అత్యతం పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. డిఎస్సీ అంటే తెలియని వారు, ఐదేళ్లు అధికారంలో ఉండగా నిర్వహించని వారు డిఎస్సీపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. సోమవారం నాడు అసెంబ్లీలో డిఎస్సీపై మంత్రి వివరణ ఇచ్చారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. మెగా డీఎస్సీ-2025పై అసెంబ్లీలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. డీఎస్సీని చాలా బాధ్యతగా తీసుకుని నిర్వహించామని పేర్కొన్నారు. 'ఏటా డీఎస్సీని నిర్వహిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చాం. మొత్తం 148 రోజుల్లోనే డీఎస్సీ నియామకాలు పూర్తి చేశాం. విద్యా వ్యవస్థలో తెదేపా ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు అమలు చేసింది. టీచర్ల నియామకాలు, బదిలీలు పారదర్శకంగా ఉండాలని సీఎం భావించారు. మా ప్రభుత్వం టీచర్లను సింగపూర్, ఫిన్‌లాండ్‌లకు పంపింది. గతంలో వైకాపా ప్రభుత్వం టీచర్లను మద్యం దుకాణాల ముందు నిలబెట్టింది' అని మంత్రి లోకేశ్ అన్నారు. మంత్రి లోకేశ్.. మాట్లాడుతూ ఇక నుంచి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామన్నారు. డీఎస్సీ నియామకాలపై

మిగతా 2లో..

## ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురండి

**- అసెంబ్లీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**- చర్చల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి**

**-జనసేన లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో మంత్రి నాదెండ్ల**



**అమరావతి, ఆగస్టు 17 (ఆర్ఎన్ఏ):** 'అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల తరఫున జనసేన బలమైన గొంతు వినిపించాలి. అసెంబ్లీ జరిగే ప్రతి నిమిషం విలువైనదే. ప్రజలకు సంబంధించిన సమస్యలను, ఇబ్బందులను ప్రజా ప్రతినిధులుగా బాధ్యతగా సభ ముందుకు తీసుకురావాలి. వివిధ అంశాలపై జరిగే చర్చల్లో జనసేన పార్టీ ప్రజాప్రతినిధులంతా పాల్గొనాల'ని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖామాత్యులు, జనసేన లెజిస్లేచర్ పార్టీ డిప్యూటీ లీడర్ నాదెండ్ల మనోహర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి తీవ్ర జ్వరం ఉండటం మూలంగా సభకు హాజరు కాలేకపోతున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రివర్యులు అందించే సూచనలు అనుసరిస్తూ సభా కార్యక్రమాలలో పాలుపంచుకుందాము అన్నారు. శాసనసభ వర్షకాల సమావేశాలు సోమవారం మొదలైన సందర్భంగా సభలో జనసేన పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, సభ్యులు వ్యవహరించాల్సిన తీరుపై జనసేన లెజిస్లేచర్ పార్టీ

మిగతా 2లో..

## బీహార్ అశోక్‌ధామ్ ఆలయంలో తొక్కిసలాట

**ఏడుగురు భక్తుల దుర్మరణం**

**పాట్నా,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** బిహార్‌లో విషాదం చోటుచేసుకుంది. లఖిసరాయ్ జిల్లాలోని అశోక్‌ధామ్ ఆలయంలో సోమవారం తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. శ్రావణమాసం సోమవారం కావడంతో ఈ శివాలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. అయితే వారి మధ్యలో ఒక ఎలక్ట్రిక్ వైర్ తెగిపడిపోవడంతో ఒక్కసారిగా భయపడిపోయారు. షాక్ కొడుతుందనే ఆందోళనతో అక్కడినుంచి బయటకు పరిగెత్తే క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో గాయపడినవారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు సత్వర చికిత్స అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలు రూ.4 లక్షల పరిహారం ప్రకటించారు. భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి వచ్చారు. దానికి తగ్గట్టే మేం ఏర్పాట్లు చేశాం. భయాందోళన కారణంగా వారు పరిగెత్తడంతో బారికేడ్లు పడిపోయాయి. దాంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. ఈ ఘటనకు ఎలక్ట్రిక్ వైర్ కారణంగా తెలుస్తోంది. ధ్రువీకరించుకున్న తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని లఖిసరాయ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ వెల్లడించారు.

**తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** బిహార్ లఖిసరాయ్‌లోని అశోక్ ధామ్ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ



దిగ్భ్రాంతికి గురయ్యారు. తొక్కిసలాటలో ఏడుగురు మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని పోస్టు చేశారు. బిహార్‌లోని లఖిసరాయ్‌లో జరిగిన తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసింది. ఈ దుఃఖ సమయంలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. బాధితులకు స్థానిక యంత్రాంగం సహాయం అందిస్తోంది' అని ప్రధాని మోదీ అన్నారు. మరోవైపు, బాధితులకు బిహార్ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

## అమెరికా గగనతలంలో తప్పిన ముప్పు

**-ఢీకొనేంతగా దగ్గరకు వెళ్లిన రెండు విమానాలు**

**-ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ చాకచక్యంతో ప్రయాణికులు సేఫ్**



**న్యూయార్క్,ఆగస్ట్17 (ఆర్ఎన్ఎ):** ఆకాశంలో అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలకు పెను ప్రమాదం తప్పింది. రెండింటికి ఒకటే నంబర్ ఉండటంతో అవి ఒకే మార్గంలోకి వచ్చి దాదాపు ఢీకొన్నంత పని అయ్యింది. అయితే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. అమెరికాలోని ఆరిజోనా రాష్ట్రం ఫీనిక్స్ ప్రాంతంలో అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలు గాల్లో ఎదురెదురుగా వచ్చాయి. ఫీనిక్స్ స్కైహార్బర్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. అందులో ఒక బోయింగ్ విమానం షికాగో నుంచి వస్తుండగా.. మరో విమానం అప్పుడే ఫీనిక్స్ నుంచి బయల్దేరింది. రెండింటికి ఒకటే పైలట్ నంబర్ ఉండటం (అమెరికన్ 2482), ప్రతికూల వాతావరణంవల్ల షికాగో విమానం ఆలస్యం కావడం రెండు విమానాలు ఒకే లైన్‌లోకి రావడానికి కారణమయ్యాయి. వేర్వేరు మార్గాల్లో వెళ్లే విమానాలకు ఎయిర్‌లైన్స్ ఇలా ఒకే

మిగతా 2లో..

# జిల్లాలో స్థానిక ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

### ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాను సిద్ధం చేయండి

### ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లాలో జరగబోవు గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు రెండవ సాధారణ ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, సజావుగా నిర్వహించడానికి అవసరమైన చర్యలను చేపట్టాలని ఎంపిడిఓ లు, మున్సిపల్ కమిషనర్లని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి డా.ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత పై జేసి ఆర్.గోవింద రావు, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ, డి ఆర్ ఓ జి.నరసింహులు, డి పి ఓ సుశీలా దేవి, డి ఎల్ డి ఓ లు, ఎం పి డి ఓ లు, మున్సిపల్ కమిషనర్ లు, తిరుపతి, నెల్లూరు, కడప జెడ్ పీ సి ఈ ఓ లు, తదితరులతో జిల్లా కలెక్టర్ బంగ్లా నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాకు సంబంధించి 807 గ్రామ పంచాయతీలు, 7,342 వార్డుల పరిధిలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, ఈ ఎన్నికలు రెండు విడుదలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎంపీడీవోలు ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల వివరాలను ఆగస్టు 21వ తేదీ లోపు ఆన్లైన్ నందు పొందుపరచాలని తెలిపారు. వార్డుల పరిధిలో 650 కంటే మించి ఓటర్లు ఉన్న ప్రదేశాలలో అదనపు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని సూచించారు. పోలింగ్ కేంద్రాలను తప్పనిసరిగా తాత్కాలిక భవనాలలో ఏర్పాటు చేయరాదని ఖచ్చితంగా శాశ్వత ప్రభుత్వ భవనాలలోని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఆగస్టు 21 తేదీ లోపు పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను సిద్ధం చేయాలని, ఆగస్టు 26 తేదీ లోపు అభ్యంతరాలు స్వీకరించాలని తెలిపారు. అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం ఆగస్టు 28వ తేదీన తుది పోలీస్ స్టేషన్లో జాబితాను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ఆమోదించిన అనంతరం ఆగస్టు 31న తుది పోలీస్ స్టేషన్లో జాబితాను ప్రచురించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో హెల్ డెస్క్, సూచిక బోర్డులు, మరుగుదొడ్లు, త్రాగునీటి వసతి, షామియానా, నిరంతర విద్యుత్తు తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా ఓటర్లు జాబితాలో ఎస్సీ,ఎస్టీ, బీసీ ఓటర్లను మార్కింగ్ చేయవలసి ఉంటుందని సూచించారు. ఈ ప్రక్రియను ఆగస్టు 18 ప్రారంభించి 22 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల మార్కింగ్ సంబంధించి అభ్యంతరాలను ఆగస్టు 26 నుండి 28వ తేదీ లోపు స్వీకరించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం గ్రామ సభలలో ప్రవేశపెట్టి ప్రజల సమక్షంలో ధ్రువీకరించిన అనంతరం సెప్టెంబర్ 7న తుది ఎస్సీ ఎస్టీ బీసీ మార్కింగ్ ఓటర్ జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో ప్రచురించాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఓటర్లు జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాను సిద్ధం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు.

# ధూమపానం చేసిన యాత్రికుడిపై పోలీసుల కేసు నమోదు

### - సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో ఆధారంగా గుర్తింపు

**తిరుపతి సిటీ,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుమల పవిత్రతను కాపాడేందుకు, టీటీడీ నిబంధనలను ఉల్లంఘించే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. తిరుమల నడక మార్గంలో బీడీ తాగుతూ సోషల్ మీడియాలో కనిపించిన వ్యక్తిని సోమవారం పోలీసులు గుర్తించారు. నల్గొండ జిల్లా దామరచర్ల మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన పొదిలా నాగరాజు (29)గా నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించేది లేదని పోలీసుల స్పష్టీకరణ చేశారు. సోషల్ మీడియాలో ప్రసారం అయిన వీడియోను పోలీసు అధికారులు పరిశీలించి, అందులో తిరుమల నడక మార్గంలో బీడీ తాగుతున్న వ్యక్తిని గుర్తించారు. విచారణలో అతను నల్గొండ జిల్లా, దామరచర్ల మండలం, నడిగడ్డ గ్రామానికి చెందిన పొదిలా నాగరాజు(29)గా గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అతడిని అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టారు. అత్యవసర పరిస్థితుల్లో 112 / 100కు సమాచారం అందించాలి- టీటీడీ అధికారులకు 9866898630 నంబర్ ద్వారా సమాచారం అందించవచ్చు. తిరుమల పవిత్రతను కాపాడటం ప్రతి భక్తుడి బాధ్యత. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## విద్యుత్ బిల్లులు డిజిటల్ విధానంలో చెల్లించాలి: ఏడిఏ



**పలమనేరు, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు ఏపిఎస్పిడిసిఎల్, వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను డిజిటల్ విధానంలో చెల్లించేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.వినియోగదారులు ఫోన్ పే, గూగుల్ పే, పే టి ఎం, అమెజాన్ పే, బిహెచ్ఐఎం, తదితర యూపీఐ /డిజిటల్ పేమెంట్ విధానాల ద్వారా ఎక్కడి నుంచైనా 24ఐ7 విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు. డిజిటల్ చెల్లింపుల ద్వారా సమయం ఆదా, క్యూ లైన్లకు దూరంగా ఉండటం, సురక్షితమైన సులభమైన చెల్లింపు వంటి ప్రయోజనాలు పొందవచ్చు.వినియోగదారులందరూ 100 శాతం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించి, గడువు తేదీలోగా విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఏపీఎస్పిడిసిఎల్ తరఫున డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోరారు.


# అప్పుల బాధలతో వ్యక్తి ఆత్మహత్య

**ఐరాల,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బొమ్మసముద్రం దళితవాడలో నివాసముంటున్న రుద్రయ్య(42) వైయస్ గేటు నందు టూ వీలర్ మెకానిక్ షాప్ నడుపుతున్నాడు. అప్పుల బాధతో సోమవారం తన గ్రామం బొమ్మ సముద్రం దళితవాడ తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కాణిపాకం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తీసుకెళ్లగా, అక్కడ వైద్య సిబ్బంది చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయగా మార్గమధ్యంలోని చనిపోయాడు. మృత దేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రుద్రయ్య మరణంతో గ్రామంలో కన్నీటి ఛాయలు అలుముకున్నాయి.

# ఈనెల 22న సీఎం జిల్లా పర్యటనకు స్థల పరిశీలన


**అనంతపురం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఈనెల 22న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు, సిద్దరాంపురం గ్రామాల పరిధిలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి స్థల పరిశీలన చేశారు. సోమవారం బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడులోని డా.బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్.డబ్ల్యు.పి.సి షెడ్ల వద్ద, సిద్దరాంపురం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల, పరిసర ప్రాంతాలను, ఎస్.డబ్ల్యు.పి.సి షెడ్ ను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల జనాభా, ఇళ్ల వివరాలు, ఆయా పంచాయతీలలో ఎస్.డబ్ల్యు.పి.సి షెడ్లు, స్వచ్ఛ రథంలు, రోజు చెత్త సేకరణ, కమ్యూనిటీ సోక్ పిట్లు, మ్యాజిక్ డ్రైన్స్, కంపోస్ట్ పిట్లు, కిచెన్ గార్డెన్, స్వచ్ఛంధ్ర కింద క్లీనింగ్ యక్టివిటీలు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఆయా ప్రాంతాల్లో ఎంత భూమి అందుబాటులో ఉంది, హెలీప్యాడ్ ఏర్పాటు, సభా కార్యక్రమం కోసం అవసరమైన స్థలం కోసం పలుచోట్ల పర్యటించి పలు వివరాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఆయా భూములకు సంబంధించి జియో కోఆర్డినేట్స్, సరిహద్దులు, ఇతర వివరాలకు సంబంధించి వెంటనే నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిపిఓ నాగరాజు నాయుడు, తహసిల్దార్ శ్రీధర్ మూర్తి, ఎంపీడీవో సాల్మన్, అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపల్ సునీత, ఆయా శాఖల అధికారులు, పోలీస్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జనసైనికుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం



**పుట్టపర్తి, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మున్సిపాలిటీ పరిధిలోని ఏనుములపల్లికి చెందిన జనసేన పార్టీ నాయకులు చింతా భాస్కర్ తీవ్ర అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతు రాత్రి మరణించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని నింపి వారికి రూ.10 వేలను జనసేన పార్టీ నాయకులు తొట్ల గంగాధర్ అందించారు. అంతే కాకుండా మృతుని కుమార్తెలకి చదువులకు కూడా తన వంతు సహాయం చేస్తానని మృతుని భార్యకు తెలియజేసి, కుటుంబ సభ్యులకి ధైర్యం చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా జనసేన కార్యకర్తలకి అందుబాటులో ఉంటూ, ఏ కార్యకర్తకి కష్టం వచ్చినా తోడుగా ఉంటానని తెలియజేశారు. కార్యక్రమంలో ముత్యాల కరుణాకర్, అయ్యా ఉమాపతి, సాయి సంతోష్, బండ్ల వెంకటేష్, అయ్యా నవీన్ కుమార్, ఎనుములపల్లి జనసేన నాయకులు, జన సైనికులు పాల్గొన్నారు.

# తిరుమలలో ఘనంగా గరుడ పంచమి



**తిరుమల, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గరుడపంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం తిరుమలలో శ్రీమలయప్ప స్వామివారు తమ ఇష్టవాహనమైన గరుడునిపై తిరుమాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షించారు. రాత్రి 7 గంటలకు గరుడ వాహనసేవ ప్రారంభమైంది. శ్రీవారి వాహనాల్లోను, సేవకుల్లోను అగ్రగణ్యుడు గరుడుడు. ప్రతి ఏడాదీ గరుడ పంచమిని శుక్ల పక్షం ఐదవ రోజు ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా "గరుడ పంచమి" పూజను నూతన దంపతులు తమ వైవాహిక జీవితం ఆనందదాయకంగా వుండేందుకు, స్త్రీలు తమకు పుట్టే సంతానం గరుడునిలాగా, బలశాలిగా ఉండేందుకు చేస్తారు. గరుడ వాహనసేవలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చినజీయర్ స్వామి, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, పాల్గొన్నారు.

# హింది పండిట్ విజయమ్మ ఉరేసుకొని మృతి



**గూడూరు, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గూడూరు జెడ్.పి. ఉన్నత పాఠశాలలో హింది పండిట్గా పనిచేస్తున్న యల్లంరాజు విజయమ్మ(51) సోమవారం ఉరేసుకొని మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడు తున్న విజయమ్మ సోమవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విజయమ్మ మృతిపై ఆమె కుమార్తె పాండేటి శ్రావ్య(21) పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గదుల దళారీ ముఠా గుట్టురట్టు

### నకిలీ ఆధార్ కార్డు ఉన్న ఒకరిపై కేసు నమోదు

**తిరుమల, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమలలోని సీఆర్వో కార్యాలయం వద్ద నకిలీ గుర్తింపు పత్రాలతో వేరొకరి పేర్లతో గదులు పొంది వాటిని అధిక ధరలకు భక్తులకు విక్రయిస్తున్న దళారీ ముఠా ప్రయత్నాన్ని టీటీడీ విజిలెన్స్ విభాగం భగ్నం చేసింది. ఆగస్టు 16న అప్పటికే ఒక గది పొందిన వ్యక్తి మరో గుర్తింపుతో తిరిగి గది కోసం క్యూలో నిలబడటాన్ని సీఆర్వో కార్యాలయం సిబ్బంది గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడిని కేరళ మలప్పురం జిల్లాకు చెందిన ఆషిక్ అలీ పి.ఎం.(32)గా గుర్తించారు. అతని వద్ద రెండు నకిలీ ఆధార్ కార్డులు, గది రిజిస్ట్రేషన్ స్లిప్, రూ.800 నగదు, సెల్ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. రంజిత్ అనే దళారి ఒక్కో గదికి రూ.1,000 చొప్పున ఇస్తామని తనను నియమించుకున్నట్లు ఆషిక్ విచారణలో వెల్లడించాడు. నకిలీ గుర్తింపు పత్రాలతో గదులు పొందడం, వాటిని దళారికి అప్పగించడం తన పని అని, ఆ గదులను భక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపాడు. ముఠాలోని ఇతర సభ్యులపై విచారణ కొనసాగుతోంది. విజిలెన్స్ విభాగం ఫిర్యాదు మేరకు తిరుమల-టుటౌన్ పోలీస్ స్టేషన్లో ఈ ఘటనపై నమోదు చేయడం జరిగింది. నకిలీ ఆధార్ కార్డుల ప్రామాణికతను నిర్ధారించడంతో పాటు, సాంకేతిక ఆధారంగా ముఠా వ్యవహారాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తిరుమలలో వసతి భక్తుల కోసం మాత్రమేనని, దళారుల ద్వారా గదులు కొనుగోలు చేయకూడదని, ఆధార్, ఫొటోలు, ఫోన్ నంబర్లు వంటి వ్యక్తిగత వివరాలను అపరిచితులకు ఇవ్వకూడదని, అదేవిధంగా వసతిని సీఆర్వో కౌంటర్లు, టీటీడీ అధికారిక వెబ్సైట్, అధికారిక మొబైల్ యాప్ ద్వారా మాత్రమే పొందాలని భక్తులకు విజ్ఞప్తి చేయడమైనది. ఎవరైనా దళారి డబ్బు తీసుకుని గది ఇప్పిస్తానని సంప్రదించినా లేదా అనుమానాస్పద కదలికలు కనిపించినా వెంటనే టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ కంట్రోల్ రూమ్ నెం: 9866898630 లేదా టీటీడీ కాల్ సెంటర్ నెం: 155257కు సమాచారం ఇవ్వాలని భక్తులను కోరడమైనది. భక్తులను మోసగించే దళారులు, వారికి సహకరించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.


**దక్షిణ రైల్వే**

**చెన్నై డివిజన్**

**ఇ-వేలం ప్రకటన / క్యాటరింగ్ / ప్రయాణీకుల సౌకర్యాలు / ఇ-వేలం / 2026**

భారత రాష్ట్రపతి తరపున, దక్షిణ రైల్వే, చెన్నై డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్, ఈ క్రింది రైల్వే స్టేషన్లు / ప్రదేశాలలో క్యాటరింగ్ స్టాల్ కాంట్రాక్టులు మరియు ప్రయాణీకుల సౌకర్యాల కాంట్రాక్టుల కేటాయింపు కొరకు ఇ-వేలం మరియు ఇ-టెండర్ ద్వారా (వాణిజ్య) బిడ్లను ఆహ్వానిస్తున్నారు.షెడ్యూల్ చేయబడిన 'ఇ'-వేలం వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి:

| క్ర. సం | కేటలాగ్ నెం | ఉప-వర్గం | స్థానం | వేలం తేదీ | టెండరింగ్ విధానం | వేలం సమయం |
|---|---|---|---|---|---|---|
| 1 | MAS-ACWH-26-03 | AC వెయిటింగ్ హాల్ | చెంగల్పట్టు | 21.08.2026 | ఈ - వేలం | 15:00 |
| 2 | MAS-RCR-26-02 | రైల్ కోచ్ రెస్టారెంట్ | పోతేరి | 25.08.2026 | ఈ - వేలం | 15:00 |
| 3 | MAS-RCR-26-02 | రైల్ కోచ్ రెస్టారెంట్ | కాట్పాడి | 25.08.2026 | ఈ - వేలం | 15:00 |
| 4 | MAS-RCR-26-02 | రైల్ కోచ్ రెస్టారెంట్ | తాంబరం | 25.08.2026 | ఈ - వేలం | 15:00 |
| 5 | NFR-MAS-Tejas | ఆహార ట్రే రైళ్ల సీట్ల వెనుక ప్రకటన | టి.నెం. 22671 / 22672 | 31.08.2026 | ఈ - వేలం | 15:30 |
| 6 | NFR-MAS-OOH-GI | OOH ప్రకటనలు | గుడువాంచేరి, కోడంబాక్కం - తాంబరం శానిటోరియం విభాగం | 31.08.2026 | ఈ - వేలం | 15:30 |
| 7 | NFR-MAS-OSD-VLK | OSD ప్రకటనలు | విల్లివాక్కం, కొరత్తూరు | 01.09.2026 | ఈ - వేలం | 15:30 |
| 8 | NFR-MAS-Textile | ప్రకటనలతో కూడిన వస్త్ర దుకాణం | తాంబరం | 01.09.2026 | ఈ - వేలం | 15:30 |
| 9 | NFR-MAS-OOH-262 | OOH-యూనిపోల్ | తిండివనం, గుడువాంచేరి, పార్కుటౌన్ (OOH) | 02.09.2026 | ఈ - వేలం | 15:30 |
| 10 | NFR-MAS-OOH-262 | OOH-యూనిపోల్ | మరైమలై నగర్, వండలూర్, కట్టంగులటూర్ | 03.09.2026 | ఈ - వేలం | 15:30 |
| 11 | MAS-PARKING-409 | పార్కింగ్ | పెరంబూర్ లోకో వర్క్స్, అరక్కోణం సైట్ డి | 21.08.2026 | ఈ - వేలం | 15:00 |
| 12 | MAS-PARKING-410 | పార్కింగ్ | పెరంబూర్ (ఉత్తర వైపు), విల్లివాక్కం (దక్షిణం వైపు), వండలూరు (GST సైడ్), సైదాపేట ఈస్ట్ సైడ్, తిరువళ్లూరు నార్త్ సైడ్, SKL కార్ | 28.08.2026 | ఈ - వేలం | 15:00 |

మిగతా అన్ని వివరాలను www.ireps.gov.in వెబ్సైట్లో చూడవచ్చు.

సీనియర్ డివిషనల్ కమర్షియల్ మేనేజర్ / చెన్నై


# తిరుపతి జిల్లా

# కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరణ



**నాయుడుపేట, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కోర్టులో సోమవారం న్యాయవాదులు విధులకు బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు పసల చెంగయ్య మాట్లాడుతూ ఇటీవల అనంతపురంలో ఒక న్యాయవాదిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి అసభ్యకరంగా మాట్లాడడాన్ని ఆయన ఖండించారు. న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించిన పోలీస్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే అడ్వకేట్ ప్రొటెక్షన్ చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఎంపీఈవో పురస్కారం అందుకున్న వల్లిపి గ్రేస్



**దొరవారిసత్రం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సం దర్భంగా తిరుపతిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ వేదికగా దొరవారిసత్రం మండలానికి చెందిన ఎంపీఈవో వల్లిపి గ్రేస్ సముచిత గౌరవాన్ని అందుకున్నారు. గత 11 సంవత్సరాలుగా అనగా 2015 నుండి 2026 వరకు ఆమె అందించిన నిరుపమాన సేవలను గుర్తిస్తూ, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావ్ చేతులమీదుగా ఆమె ఈ ప్రతిష్టాత్మక "ఉత్తమ ఎంపీఈవో" పురస్కారాన్ని స్వీకరించారు. వల్లిపి గ్రేస్ అందుకున్న ఈ అవార్డు కేవలం ఒక ప్రశంసాపత్రం మాత్రమే కాదు.క్షేత్రస్థాయిలో ఒక ప్రభుత్వ ఉద్యోగి దశాబ్ద కాలానికి పైగా చూపిన నిరంతర శ్రమకు, నిలకడైన నిబద్ధతకు దక్కిన ఘన సత్కారం. 2015లో విధి నిర్వహణలో చేరిన నాటి నుండి నేటి వరకు ఆమె ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం. సచివాలయ వ్యవస్థ రాకముందు ఆమె దొరవారిసత్రం మండలమంతా విస్తృతంగా పనిచేసి రైతాంగానికి అండగా నిలిచారు. ఆ తర్వాత సచివాలయ వ్యవస్థ అమల్లోకి వచ్చిన కొత్తలో కొత్తపల్లి సచివాలయ పరిధిలో తన మార్కు సేవలను అందించారు. తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్లో, జిల్లా ఉన్నతాధికారులు, వేలాది మంది ప్రజల సమక్షంలో జిల్లా వ్యవసాయ అధికారి చేతులమీదుగా పురస్కారం అందుకోవడం దొరవారిసత్రం మండలానికే గర్వకారణం. విధి నిర్వహణలో అలసత్వం వహించే ఎంతోమందికి వల్లిపి గ్రేస్ ఒక దిక్సూచిలా, రోల్ మోడల్గా నిలుస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు.

# సిపిఐ ఆధ్వర్యంలో ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా

### - రైతాంగ సమస్యలు పరిష్కరించాలి: ఆర్డీవోకి వినతి పత్రం

**సూళ్లూరుపేట,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏఐకేఎస్ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో పట్టణ ఆర్డీవో కార్యాలయం ముందు సోమవారం రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ రెడ్డి సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఇలప నాగేంద్రబాబులు మాట్లాడుతూ ప్రభు త్వాలు రైతాంగం పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని కనబరుస్తున్నాయని ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఏమాత్రం అమలు జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు ప్రధానంగా సూళ్లూరుపేట రెవెన్యూ డివిషన్లో అనేక రైతాంగ సమస్యలు ఉన్నాయని బుచ్చినాయుడు కండిగ మండలం విఎస్ పురంలో సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వలేదని అలాగే సూళ్లూరుపేట రెవిన్యూ డివిజన్ పరిధిలో తెలుగు గంగ చీలు కాలువలను పూర్తి చేయాలని, ఆక్రమణలకు గురైన పంట కాలువలను వెలికితీయాలని కోరారు. దాదాపు 1500 ఎకరాల కు నకిలీ విత్తనాల ద్వారా రైతులు మూడు కోట్ల రూపాయల మేర నష్టపోతే వ్యవసాయ అధికారులు రెవెన్యూ అధికారులు ఇప్పటికీ కూడా వారికి తగిన నష్టపరిహారం అందించలేదని నష్టపోయిన రైతాంగం ఎదురుచూపులు తప్పడం లేదని ఇకనైనా బాధిత రైతాంగానికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రమణయ్య శ్రీనివాసులు,ఆనంద్ బాబు ఓ కుమార్ బాలు రజిని చంచమ్మ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎం.వి.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరం

**గూడూరు,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గూడూరు పట్టణం న్యూ బాలాజీ నగర్ లోని వెరిటాస్ జూనియర్ కాలేజీ ఆవరణంలో సోమవారం కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన విద్యా ప్రదాత స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు శ్రీమతి ఆదిలక్ష్మి గార్ల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఎం.వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వెరిటాస్ జూనియర్ కళాశాల చైర్మన్ నాదెండ్ల హరిబాబు, కరెస్పాండెంట్ సుకుమార్ నాయుడు ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసారు. పట్టణంలోని బాలాజీ నగర్ ఇతర ప్రాంతాల నుంచి కంటి సమస్యలతో బాధపడే వారు ఈ శిబిరానికి హాజరయ్యారు. కోట పట్టణానికి చెందిన రమేష్ ఐ కేర్ నేత్ర వైద్యుడు డాక్టర్ వి.రమేష్ బాబు నేత్ర సమస్యలతో బాధపడే వారికి కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న వారిని గుర్తించారు. గూడూరు పట్టణం నుంచి వందల మంది శిబిరానికి హాజరై నేత్ర సమస్యలను చూపించుకున్నారు. దృష్టిలోపం ఉన్న వారికి అతి తక్కువ ధరకు కంటి అద్దాలు పంపిణీ చేయనున్నామని, కంటిలో శుక్లాలు ఇతర సమస్యలతో బాధపడేవారికి తిరుపతి పట్టణానికి చెందిన వాసన్ ఐ కేర్లో శస్త్ర చికిత్సలు చేయించి వారికి నెలకు సరిపడా మందులను ఉచితంగా ఇవ్వనున్నామని ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలామోహన్ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలామోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం.విజయలక్ష్మి, డాక్టర్ సుగుణమ్మ, ప్రిన్సిపాల్ దొగ్గోలు బాబు రెడ్డి, కోలా మీరయ్య నాయుడు అంగన్వాడి టీచర్ ఎం షాజీదా కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.


**దక్షిణ రైల్వే**

**లోకో వర్క్స్, అయనవరం, చెన్నై - 600 023**

**ఇ-టెండర్ నోటీసు**

**ఓపెన్ టెండర్ నోటీసు నెం. LW_CONT_SCP_UF_COACH_26**

చీఫ్ వర్క్షాప్ మేనేజర్ / లోకో వర్క్స్ / అయనవరం, సదరన్ రైల్వే, చెన్నై – 600 023 వారు, భారత రాష్ట్రపతి తరపున, www.ireps.gov.in అనే ఈ-టెండర్ పోర్టల్లో జారీ చేసిన టెండర్ నోటీసు ప్రకారం క్రింది ఆన్లైన్ ఓపెన్ టెండర్ను ఆహ్వానిస్తున్నారు.
పనులు / సర్వీస్ కాంట్రాక్టులకు సంబంధించి ఈ-టెండర్లో పాల్గొనదలచిన టెండరర్లు ముందుగా పై పేర్కొన్న ఈ-టెండర్ పోర్టల్లో తమను నమోదు చేసుకోవాలి. ఆన్లైన్ ద్వారా సమర్పించిన టెండర్లను మాత్రమే స్వీకరిస్తారు.
బిడ్ సెక్యూరిటీ డిపాజిట్ చెల్లింపు తప్పనిసరిగా ఆన్లైన్ చెల్లింపు విధానం ద్వారా మాత్రమే చేయాలి. ఈ-టెండర్ ప్రక్రియలో పాల్గొనడానికి అవసరమైన డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్లు పొందడం టెండరర్(ల) బాధ్యత.

| | |
|---|---|
| టెండర్ నెం. | LW_Cont_SCP_UF_Coach_26 |
| (పని పేరు) కొరకు టెండర్ | పెరంబూర్లోని లోకో వర్క్షాప్ ప్రాంగణంలో అన్ని రకాల కోచ్ల అండర్ ఫ్రేమ్కు స్క్రాపింగ్, క్లీనింగ్ మరియు పెయింటింగ్ చేయడం. |
| పరిమాణం | షెడ్యూల్ ప్రకారం |
| ఒప్పంద కాలం | LOA జారీ చేసిన తేదీ నుండి 24 నెలలు |
| అంచనా వేయబడిన టెండర్ విలువ | రూ.36,18,861.82/- (ముప్పై ఆరు లక్షల పద్దెనిమిది వేల ఎనిమిది వందల అరవై ఒక్క ఎనభై రెండు పైసలు మాత్రమే) |
| బిడ్ సెక్యూరిటీ డిపాజిట్ మొత్తం | రూ. 72,400/- (డెబ్బై రెండు వేల నాలుగు వందల రూపాయలు మాత్రమే) |
| టెండర్ బుక్లెట్ ఖర్చు | లేదు |
| టెండర్ గడువు తేదీ | 02/09/2026 న 15:30 గంటలకు |
| వెబ్సైట్ వివరాలు | www.ireps.gov.in |

గమనిక:
1) అంచనా వేయబడిన టెండర్ విలువ, బిడ్ సెక్యూరిటీ మొత్తం మరియు బిడ్ సమర్పణ వివరాలు పైన పేర్కొన్న ఇ-పోర్టల్లో పొందుపరచబడ్డాయి.
2) పైన పేర్కొన్న పోర్టల్ ద్వారా ఆహ్వానించబడిన టెండర్ల కోసం ఆన్లైన్ బిడ్లు డిజిటల్గా సంతకం చేయబడాలి.
3) బిడ్ వేయడానికి ముందు, టెండరర్ IREPS పోర్టల్లో రైల్వే పరిపాలన జారీ చేసిన ఏవైనా అవసరమైన సవరణలను పాటించాలి.
4) ఆఫర్ మరియు బిడ్ సెక్యూరిటీ యొక్క చెల్లుబాటు, టెండర్ తెరిచిన తేదీ నుండి కనీసం 60 రోజులు లేదా పరస్పర అంగీకారంతో అవసరమైతే మరింత పొడిగించబడే కాలం వరకు ఉండాలి.
5) ఎటువంటి కారణాలు చెప్పకుండా టెండర్ను రద్దు చేసే హక్కు రైల్వేకు ఉంది.
6) టెండర్కు సంబంధించిన ఇతర నిబంధనలు మరియు షరతులు టెండర్ పత్రంలో వివరంగా పొందుపరచబడ్డాయి.

చీఫ్ వర్క్షాప్ మేనేజర్ / లోకో వర్క్స్ / అయనవరం, చెన్నై 600023

## ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కుప్పం,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బి.నరసింగరాయనిపేట ఐటీఐలో 2026--27కి మూడవ విడత ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రిన్సిపాల్ తెలిపారు. అభ్యర్థులు 19న సాయంత్రం 5 గంటలలోపు itiadmissions.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆగస్టు 19వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు వెబ్‌సైట్‌లో తమ ప్రాధాన్యతలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల జాబితా 20న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్ నోటిఫికేషన్ ద్వారా వెల్లడవుతుందని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు బి.నరసింగరాయనిపేట ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో హాజరుకావాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ప్రిన్సిపాల్ కోరారు.

## రామకుప్పంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**రామకుప్పం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి దేవాలయం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం టీఎస్ మెడికల్ కళాశాల వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి 40 మంది ప్రజలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యుల పరీక్షల అనంతరం 10 మంది సభ్యులను ఆపరేషన్ కొరకు ఎంపిక చేశారు. శిబిరంలో డాక్టర్ అశ్రిత, డాక్టర్ కార్తీక్ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు సీతాపతితో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సీఎం వ్యక్తిగత కార్యదర్శిను కలిసిన బహుజనసేన నాయకులు



**కుప్పం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యక్తిగత కార్యదర్శి శ్రీకాంత్‌ను సోమవారం కుప్పంలో బహుజనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, కుప్పం నియోజకవర్గంలోని దళితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రకాష్, దళిత సీనియర్ నాయకుడు బాలచంద్రబాబు, బహుజనసేన కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్. మహేష్ కుమార్ తదితరులు శ్రీకాంత్‌ను కలిశారు. ముఖ్యంగా మల్లనూరు పంచాయతీలోని గొడిగడ్డల చెరువు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిసి అందజేసిన వినతిపత్రం లోనూ ఈ సమస్యను ప్రస్తావించిన విషయాన్ని వివరించారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులకు సిఫారసు చేసి చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని శ్రీకాంత్ హామీ ఇచ్చారు. ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. బహుజనసేన నాయకుల వినతిని విన్న శ్రీకాంత్ సానుకూలంగా స్పందించారు. సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కార చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కుప్పం నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాలు, దళితుల హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయం సాధనకు బహుజనసేన నిరంతరం పోరాడుతుందని నాయకులు తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## రేపు చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రమాణ స్వీకారం



**కుప్పం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, అన్ని నియోజకవర్గాల మండల కాంగ్రెస్ అధ్యక్షుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఈ నెల 19వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డి. రమేష్ బాబు, చిత్తూరు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ టిక్కారాం తెలిపారు. వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి చిత్తూరు జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు, మండల అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, వివిధ విభాగాలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, చైర్మన్లు, కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్‌కు డిగ్రీ కళాశాల విద్యార్థులు



**కుప్పం,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు క్రీడారంగంలో ప్రతిభ చాటుతూ రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించారు. కళాశాల నుంచి మొత్తం పది మంది విద్యార్థులు వివిధ క్రీడా విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సాగర్ రాజ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో ఖోఖో విభాగంలో కె. దర్శిని, ఎస్. పూజ, ఎం. రమ్య, వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో వి. నరేంద్రచారి, వి.ఎం. ఆదర్శ్, వాలీబాల్ విభాగంలో ఆర్. ఇంద్రశ్రీ, అథ్లెటిక్స్ విభాగంలో వి. అర్జున్, జె.ఎస్. మోహన్, కె. సుదర్శన్, పి.జె. అరుణ్ రాజస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు కళాశాల స్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కళాశాల యాజమాన్యం ఆకాంక్షించింది. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందుతాయని పేర్కొంది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.సుధారాణి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు కళాశాలలో ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కళాశాలకు గర్వకారణంగా నిలిచేలా రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

## తాడిపత్రి భూ వ్యవహారంలో నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్

### ముగ్గురికి ఛార్జ్ మెమోలు జారీ

### నిబంధనల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటాం: జిల్లా కలెక్టర్

**అనంతపురం,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తాడిపత్రి మండలం, తాడిపత్రి గ్రామంలోని సర్వే నం.770-జు2లోని ఎ.2.40 సెంట్ల భూమిని రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-ఏ(1)(డి) నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించేందుకు జరిగిన ప్రక్రియపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమగ్రంగా రికార్డులను పరిశీలించారు. రికార్డుల పరిశీలనలో భాగంగా ల్యాండ్ సీలింగ్ రిజిస్టర్ లోని నమోదులో మార్పులు జరిగినట్లు కనిపించడం, తహసీల్దార్ కార్యాలయంలో ల్యాండ్ సీలింగ్ రిజిస్టర్ లో 17, 18 పేజీలు కనిపించకపోవడం, 1-దీ రిజిస్టర్ మరియు అడంగల్‌లో డి.పట్టాగా నమోదు ఉండటం, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో “సీలింగ్ ల్యాండ్” ప్రస్తావన ఉండటం, అలాగే ఆర్డీఓ కార్యాలయంలోని ల్యాండ్ సీలింగ్ రిజిస్టర్ లో జ.జ.చీశీ.2963/75 తాడిపత్రి కింద సర్వే నంబర్ 770-ఈ2, ఏసీ 2.40 సెంట్లకు సంబంధించిన నమోదు ఉండటం వంటి అంశాలు గుర్తించబడ్డాయి. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు భూ రికార్డులను సక్రమంగా పరిశీలించకపోవడం, అవసరమైన విచారణ/ధృవీకరణ చేయకపోవడం, రికార్డుల్లోని వ్యత్యాసాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకపోవడం, విధి నిర్వహణలో తగిన జాగ్రత్తలు పాటించకపోవడం వంటి అభియోగాలపై నిబంధనల ప్రకారం శాఖాపరమైన చర్యలు చేపట్టారు. తాడిపత్రి అప్పటి తహసీల్దార్, ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్ జి.సోమశేఖర్ సంబంధిత రెవెన్యూ, ల్యాండ్ సీలింగ్ రికార్డులను పూర్తిగా పరిశీలించకుండా ప్రతిపాదన సమర్పించడం, రికార్డుల్లోని ముఖ్యమైన వ్యత్యాసాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకపోవడం, తదితర అభియోగాలపై సస్పెన్షన్‌తో పాటు ఛార్జ్ మెమో జారీ చేశారు.మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.ఈశ్వర్ రెడ్డి అవసరమైన విచారణ నివేదిక సమర్పించకపోవడం, సంబంధిత రెవెన్యూ మరియు ల్యాండ్ సీలింగ్ రికార్డులను సక్రమంగా ధృవీకరించకపోవడం, తదితర అభియోగాలపై సస్పెన్షన్‌తో పాటు ఛార్జ్ మెమో జారీ చేశారు. గ్రామ రెవెన్యూ అధికారి కె.వెంకటస్వామి అవసరమైన విచారణ/ధృవీకరణ చేయకపోవడం, రికార్డుల్లోని ముఖ్యమైన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకపోవడం, తదితర అభియోగాలపై గ్రామ రెవెన్యూ అధికారిని సస్పెన్షన్‌తో పాటు ఛార్జ్ మెమో జారీ చేశారు. అనంతపురం ఆర్డీఓ కార్యాలయం డిప్యూటీ తహసిల్దార్ యు.రాజేంద్రప్రసాద్ ఆర్డీఓ కార్యాలయంలోని ల్యాండ్ సీలింగ్ రిజిస్టర్‌లో ఉన్న C.C.No.2963/75 TDP, Sy.No.770-E2 నమోదు పరిశీలించకపోవడం, సంబంధిత వ్యత్యాసాలను కాంపిటెంట్ అథారిటీ దృష్టికి తీసుకురాకపోవడం, తదితర అభియోగాలపై ముగ్గురికి ఛార్జ్ మెమో జారీ చేశారు. ప్రభుత్వ భూములు, ల్యాండ్ సీలింగ్ భూములు, నిషేధిత ఆస్తులకు సంబంధించిన రికార్డుల పరిశీలనలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేదా రికార్డుల ధృవీకరణలో లోపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, బాధ్యతలో లోపాలు గుర్తించిన సందర్భాల్లో నిబంధనల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యం

### - 70వ ఆవిర్భావ దినోత్సవంలో రాష్ట్ర కార్యదర్శి బండపల్లె అక్కులప్ప



**మదనపల్లె,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ప్రధాన ధ్యేయమని సంఘం రాష్ట్ర కార్యదర్శి బండపల్లె అక్కులప్ప పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం మదనపల్లెలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సంఘం పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కులప్ప మాట్లాడుతూ సమాజంలో జరిగే మంచి, చెడు విషయాలను ప్రజల ముందుకు తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టులు తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తున్నారని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు హక్కుల సాధనలో సంఘం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఒత్తిళ్లు, బెదిరింపులకు గురికాకుండా స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, అక్రిడిటేషన్లు, ఆరోగ్యం, బీమా, నివాసం తదితర సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని కోరారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి వంశీధర్, మదనపల్లె ప్రెస్‌క్లబ్ కన్వీనర్ షామీర్ భాష మాట్లాడుతూ 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జర్నలిజం విలువలను కాపాడుతూ, జర్నలిస్టుల హక్కులను పరిరక్షిస్తూ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు శ్రీనివాసగౌడ్, బాలు యాదవ్, మాస్ రామచంద్ర, కొక్కంటి ఈశ్వర్, దేవరెంటి ఈశ్వర్, కోదండరెడ్డి, రాము, కిరణ్, శివకుమార్, విజయ్ పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు కోసం ఉద్యోగులు కదలాలి

### - 20న చలో విజయవాడను విజయవంతం చేయాలి: ఏపీసీపీఎస్ఈఏ

**మదనపల్లె,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీసీపీఎస్ఈఏ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 20న విజయవాడలో నిర్వహించనున్న ‘చలో విజయవాడ’ కార్యక్రమాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలం సేవలందించిన ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయకుండా అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. పెన్షన్ హక్కుకు సంబంధించిన న్యాయస్థాన తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు కోసం అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కాళ్లన్న, కిల్లా నాగరాజు, కె. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# చిత్తూరు జిల్లా

## ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత వేగం

### పీజీఆర్‌ఎస్‌లో 70 వినతులు స్వీకరించిన కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మట్



**కుప్పం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి వేగవంతమైన పరిష్కారం చూపే లక్ష్యంతో ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మట్ ప్రజల నుంచి వినతులను స్వీకరించి, సమస్యల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 70 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు అత్యధికంగా 32 వినతులు రాగా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు 5, ఉపాధి, ఆరోగ్య శాఖలకు చెరో 4, పంచాయతీరాజ్, రెస్కో, విద్యాశాఖలకు చెరో 3, పీ4, పోలీస్ శాఖలకు చెరో 2 వినతులు అందాయి. అదేవిధంగా ఏపీఎస్‌ఆర్టీసీ, సెర్ప్, సీఎంఆర్‌ఎఫ్, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్, ఆర్థిక సహాయం, అటవీ, పశుసంవర్ధక, పెన్షన్లు, ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్), పౌరసరఫరాల శాఖలకు సంబంధించి ఒక్కొక్క వినతి నమోదైంది. ఈ సందర్భంగా కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మట్ మాట్లాడుతూ, పీజీఆర్‌ఎస్‌లో అందుతున్న ప్రతి వినతిని అధికారులు ప్రజల సమస్యగా భావించి బాధ్యతతో పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో అవసరమైన శాఖల మధ్య సమన్వయం పెంచి, నిర్ణీత గడువులోగా చర్యలు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులను నమోదు చేసుకున్నారు.

## విజయవంతంగా ఇంటింటికి తెలుగుదేశం



**రామకుప్పం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి నేతృత్వంలో రామకుప్పం పట్టణంలో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను నేతలు ప్రజలకు వివరించారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, పాఠశాలల ఆధునీకరణ, ఆరోగ్య కేంద్రాల బలోపేతం, రైతులకు పెట్టుబడి సహాయం వంటి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కుప్పం నియోజకవర్గం రాష్ట్రానికే రోల్ మోడల్ గా నిలిచిందని, రామకుప్పం మండలంలో కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతోందని ఆంజనేయ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఓ యూనిట్ ఇంచార్జ్ రామకృష్ణ, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, మైనార్టీ నేత సలాం సాబ్, మాజీ ఎంపీటీసీ అల్లి శ్రీను, బిఎస్ మోహన్, మంజునాథ్, సుబ్రి,బాలరాజు, బూత్ కోఆర్డినేటర్ చాంద్ భాషా, ఆఫీస్ స్థానిక నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సేవయే పరమావధి: ఎంపీడీవో

**రామకుప్పం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ పరిధిలోని రామకుప్పం మండలంలో ప్రజా సంక్షేమమే ప్రధాన అజెండాగా పనిచేస్తానని రామకుప్పం ఎంపీడీవో అశ్విని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి నేరుగా చేరేలా ప్రత్యేక చర్యలు చేపడతానని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడటంతో పాటు అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో సచివాలయ సిబ్బంది విధి నిష్టతో, బాధ్యతగా విధులు నిర్వర్తించేలా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తక్షణమే పరిష్కరించడమే తన లక్ష్యమని, ఉత్తమ కర్తవ్య నిర్వహణతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సోమవారం ఎంపీడీవో అశ్వినికి రామకుప్పం మండల మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీతో పాటు పలువురు తెదేపా నేతలు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామకృష్ణప్ప, మాజీ ఎంపీటీసీ అల్లి శ్రీను, రామకుప్పం పంచాయతీ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, జిల్లా మైనార్టీ నేత సలాం సబ్, ముఖ్య నేతలు బిఎస్ మోహన్, మంజునాథ్, బాలరాజు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



**పలమనేరు, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఈనెల 19వ తేదీ చిత్తూరు జిల్లాలోని అంబేద్కర్ భవనంలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ కార్యక్రమానికి నియోజకవర్గ జనసేన పార్టీ లీడర్ డాక్టర్ ఆకుల గజేంద్రప్రసాద్‌కు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ ఆహ్వాన పత్రికను సోమవారం వారు అందించారు. ఈ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం కార్యక్రమానికి చిత్తూరు జిల్లా ఎంపీ దుగ్గిమల్ల ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, గంగాధర్ నెల్లూరు ఎమ్మెల్యే దామస్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, జిల్లా కలెక్టర్ సుమంత్ కుమార్, చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూ డే, కటారి హేమలత, సీకే బాబు, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, మున్సిపల్ మాజీ డిప్యూటీ మేయర్ రాజేష్, టిడిపి లీడర్లు వసంత కుమార్, కాజూరు బాలాజీ, పలమనేరు నియోజకవర్గ జనసేన పార్టీ లీడర్ డాక్టర్ ఆకుల రాజేంద్ర ప్రసాద్, వీరిని ఆహ్వానించడం జరిగిందన్నారు. అనంతరం ఉచిత కంటి వైద్య పరీక్షలు శంకర్ నేత్రాలయ వారి సహకారంతో నిర్వహిస్తారు, రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు.

## కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో భక్తులు రద్దీ



**పలమనేరు, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో ప్రసిద్ధిగాంచిన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నాగల చవితి సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి పట్టణ క్రమ గ్రామీణ ప్రాంత ప్రజలు బారులు తీరారు. శివాలయం చైర్మన్ మురళీకృష్ణ, అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. గంటావూరు చెందిన బాలాజీ ట్రేడర్స్ సందీప్ వారిచే ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో శివాలయం వైస్ చైర్మన్ మంజునాథ్, డైరెక్టర్లు ఎంటిఆర్ ప్రసాద్, వీరప్ప, సుజాత, రెడ్డప్ప, మోహన ప్రియ, బాబు, మాధవ్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# దేశ అంతర్గత భద్రతలో సీఆర్పీఎఫ్ సేవలు అమోఘం

## - సీఆర్పీఎఫ్ భవనాలను ప్రారంభించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**కలికిరి, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశ అంతర్గత భద్రతను కాపాడటంలో సీఆర్పీఎఫ్ బలగాలు చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సీఆర్పీఎఫ్ జవాన్ల వల్లే దేశం సురక్షితంగా ఉందనే నమ్మకం ప్రజల్లో ఏర్పడిందని పేర్కొన్నారు. దేశ భద్రత, సార్వభౌమత్వ పరిరక్షణ కోసం 24 గంటలూ విధులు నిర్వహిస్తున్న జవాన్ల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర మంత్రికి టీటీడీ సభ్యుడు భానుప్రకాశ్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో కలికిరిలోని సీఆర్పీఎఫ్ కేంద్రానికి చేరుకున్న కేంద్ర మంత్రి తొలుత అమరవీరుల స్థూపాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కలికిరి సీఆర్పీఎఫ్ కేంద్రంలో



రూ.26 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆఫీసర్స్ మెస్, సబార్డినేట్ ఆఫీసర్స్ మెస్, రిక్రియేషన్ క్లబ్, స్టోర్ బ్లాక్, ట్రేడ్స్‌మెన్ బ్లాక్ భవన సముదాయాలను కేంద్ర మంత్రి ప్రారంభించి జాతికి అంకితం చేశారు. వీటిలో రూ.9.47 కోట్లతో ఆఫీసర్స్ మెస్, రూ.7.90 కోట్లతో సబార్డినేట్ ఆఫీసర్స్ మెస్, రూ.4.90 కోట్లతో రిక్రియేషన్ క్లబ్, రూ.4.55 కోట్లతో స్టోర్ బ్లాక్ నిర్మించారు. ఈ ఆధునిక మౌలిక వసతులు సీఆర్పీఎఫ్ అధికారులు, జవాన్లకు మెరుగైన సౌకర్యాలను అందించడంతో పాటు వారి విధి నిర్వహణ సామర్థ్యాన్ని మరింత పెంచనున్నాయి. ఈసందర్భంగా సీఆర్పీఎఫ్ జవాన్లను ఉద్దేశించి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, కొత్తగా ప్రారంభించిన భవనాలు కేవలం నిర్మాణాలు మాత్రమే కాదని, జవాన్ల సంక్షేమం, సౌకర్యాలు, పనితీరు మెరుగుపర్చాలనే కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు ప్రతీకలని అన్నారు. కఠినమైన విధుల అనంతరం జవాన్లు కొంత సమయం ప్రశాంతంగా గడిపేందుకు రిక్రియేషన్ క్లబ్ ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ భవనాలు బలగాల కార్యాచరణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే సిబ్బందికి యాంటీ టెర్రరిజం, కౌంటర్ ఇన్‌సర్జెన్సీ వంటి ప్రత్యేక నైపుణ్యాల్లో శిక్షణ అందించాలనే లక్ష్యంతో కలికిరిలో 2017 మే 11న సీఆర్పీఎఫ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2018లో మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టగా, 2019 నుంచి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఏడీజీ సౌత్ జోన్ రవిదీప్ సింగ్ సాహి, ఐజీ దినేష్ ప్రతాప్ ఉపాధ్యాయ్, బ్రిగేడియర్ అనుపమ్ శర్మ, డీఐ సుభాష్ చంద్రశర్మ, చీఫ్ ఇంజనీర్ సీఎన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో 'ఆదిత్య' విద్యార్థుల సత్తా!

### - 20 మందికి ఉద్యోగాలు: డైరెక్టర్, ప్రిన్సిపాల్ అభినందనలు



**మదనపల్లె, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు క్యాంపస్ నియామకాల్లో సత్తా చాటారు. బెంగళూరుకు చెందిన క్లిమెంటోస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.3.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వేతన ప్యాకేజీలు లభించాయి. కళాశాల డైరెక్టర్ డా.ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ డా.రాయుడు పయ్యల ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వం, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అందిస్తున్న శిక్షణతో పాటు ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ విభాగం సమిష్టి కృషితో ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఈ సందర్భంగా డీన్-ప్లేస్‌మెంట్స్ డా.డి.శ్రీనివాసులు రెడ్డి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు డా.ఆర్.కిరణ్ కుమార్, సి.మనోజ్ కుమార్‌తో పాటు అన్ని విభాగాల కో-ఆర్డినేటర్లను యాజమాన్యం అభినందించింది. 20 మంది విద్యార్థులకు ఉద్యోగాలు రావడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

# ఫిర్యాదులపై వేగంగా విచారణ పూర్తి చేయాలి: ఎస్పీ ధీరజ్



**మదనపల్లె, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులపై వేగంగా స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అధికారులను ఆదేశించారు. సోమవారం మదనపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 64 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో భూ వివాదాలు 18, న్యూసెన్స్ 11, కుటుంబ వివాదాలు 10, ఆర్థిక వివాదాలు 8, మోసం 8, ఇతర ఫిర్యాదులు 4, ఎఫ్ఐఆర్‌లు 2, తప్పిపోయినవారికి సంబంధించినవి 2, సైబర్ నేరానికి సంబంధించిన ఫిర్యాదు ఒకటి ఉన్నాయి. భూకబ్జాలు, వడ్డీ వ్యాపారుల వేధింపులు, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణమే విచారణ చేపట్టాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదులపై విచారణను త్వరగా పూర్తి చేసి నివేదికలనుజిల్లాప్రధాన కార్యాలయానికిపంపాలని ఆదేశించారు.

# రాత్రి 10:30 గంటల తర్వాత షాపులు తెరిస్తే కఠిన చర్యలు

### - ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలు

**మదనపల్లె,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా రాత్రి వేళల్లో చోరీలను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని అన్ని వ్యాపార సముదాయాలను రాత్రి 10:30 గంటలకల్లా మూసివేయాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశించారు. మదనపల్లె, రాయచోటి, పీలేరు, పుంగనూరు పట్టణాలతో పాటు హైవేలపై ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు, టీ దుకాణాలు, దాబాలు కూడా నిర్ణీత సమయానికి మూసివేయాలని సూచించారు. 10:30 గంటల తర్వాత దుకాణాలు తెరిచి ఉంచితే నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. రాత్రివేళల్లో తెరిచి ఉండే దుకాణాలను ఆసరాగా చేసుకుని దొంగలు సంచరిస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మదనపల్లె వన్‌టౌన్ పరిధిలో జరిగిన భారీ చోరీ కేసులో సీసీఎస్, వన్‌టౌన్ పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. ఘటనా స్థలంలో లభించిన పామ్ ప్రింట్ల ఆధారంగా నిందితులను మధ్యప్రదేశ్‌కు చెందిన 'శివపురి గ్యాంగ్'గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చేపట్టాయి.

# పీజీఆర్ఎస్ అర్జీలకు గడువు లోగా పరిష్కారం చూపాలి

### - ఇన్‌చార్జి కలెక్టర్ శివ్ నారాయణ శర్మ



**మదనపల్లె, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీజీఆర్ఎస్ అర్జీలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ జరిపి నిర్ణీత గడువులో నాణ్యమైన పరిష్కారం చూపాలని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించాలని, పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ అర్జీలకు తావులేకుండా చూడాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఇన్‌చార్జి కలెక్టర్‌తో పాటు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్ఓ వెంకటేష్, కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్‌డీసీ మాధవరెడ్డి, సర్వే శాఖ ఏడీ శాంతరాజ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో 347 అర్జీలు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా మార్పులపై దృష్టి సారించాలి

### -ఎస్ఐఆర్ అనంతరం అభ్యంతరాలను పరిశీలించాలి


### - ఇంచార్జి కలెక్టర్‌కు నిస్సార్ అహమద్ వినతి



**మదనపల్లె, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎస్ఐఆర్ అనంతరం ఓటర్ల జాబితాల్లో చోటుచేసుకున్న మార్పులు, పోలింగ్ కేంద్రాల మార్పులపై వచ్చిన అభ్యంతరాలను నిబంధనల మేరకు పరిశీలించి పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఎస్. నిసార్ అహమద్ కోరారు. ఈ మేరకు సోమవారం ఇంచార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మ కు వినతిపత్రం సమర్పించారు. కొన్ని ప్రాంతాల్లో ఓటర్లను ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో కేంద్రానికి మార్చినట్లు తమ దృష్టికి వచ్చిందని, కొన్ని సందర్భాల్లో ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు కేంద్రాలకు మారినట్లు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. అలాగే ఎస్ఐఆర్‌కు సంబంధించి నోటీసులు అందుకున్న ఓటర్లకు, ముఖ్యంగా దూర ప్రాంతాల్లో ఉన్న వారికి, నిబంధనలకు అనుగుణంగా తగిన వెసులుబాటు కల్పించాలని కోరారు. ప్రభావిత ఓటర్ల అభ్యంతరాలను పరిశీలించి అర్హులైన వారి వివరాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్. రెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షులు ఎన్. నవాజ్ అలీ ఖాన్, చిప్పిలి మల్లికార్జున రెడ్డి, నాయకులు కొత్తపల్లి నాగార్జున నాయుడు, బయ్యా రెడ్డి, చెన్నకృష్ణ, మాలెపాడు చలపతి పాల్గొన్నారు.

# గార్గేయ ప్రాజెక్టు నీరు విడుదల చేయాలి

### - 3 గ్రామాల రైతుల ఆర్డీవోకి వినతి



**పీలేరు, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గార్గేయ ప్రాజెక్టు ఆయకట్టు క్రింద ఉన్న పీలేరు మండలం బాలంవారిపల్లి, దొడ్డిపల్లి, కాకులారం పల్లి గ్రామాల రైతులు తీవ్ర నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నామని ఆర్డీవోకి సోమవారం గ్రీవెన్స్ డేలో వినతి పత్రం అందజేశారు. గార్గేయ ప్రాజెక్టు కాలువ ద్వారా తమ పొలాలకు నీరు రావాల్సి ఉండగా, పీలేరు పంచాయితీ వారు డ్రింకింగ్ వాటర్ కోసం తూముల కింద నిల్వ నీటిని తీసుకుంటున్నారని, మరో ప్రాజెక్టు లైన్ ద్వారా కూడా పట్టణానికి నీటిని సరఫరా చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, గ్రామాలలో మంచినీటికి కూడా కొరత ఏర్పడిందని తెలిపారు. తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి గార్గేయ ప్రాజెక్టులోని నీటిని 3 రోజులకు ఒకసారి తూముల ద్వారా క్రిందికి విడుదల చేయాలని రైతులు కోరారు. లేనిపక్షంలో పంటలు పూర్తిగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మూడు గ్రామాల రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ వర్ధంతి సందర్భంగా అన్నదానం

**పీలేరు, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీలేరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వి. శ్రీకాంత్ రెడ్డి అత్త కోడూరు ఇందిరమ్మ వర్ధంతి సందర్భంగా అన్నా క్యాంటీన్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీలేరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి మాట్లాడుతూ, కోడూరు ఇందిరమ్మ సేవలను స్మరించుకోవడం అభినందనీయమన్నారు. ఆమె వర్ధంతి సందర్భంగా అన్నదానం నిర్వహించడం ద్వారా పేదలు, నిరుపేదలకు భోజనం అందించడం మంచి కార్యక్రమమని పేర్కొన్నారు. సమాజంలో సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు వి.శ్రీకాంత్ రెడ్డి, ఎన్. అమరనాథ రెడ్డి, టీడీపీ బీసీ మండల అధ్యక్షులు వసంతల రాజా తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి స్మగ్లర్‌పై పిట్ ఎన్‌డీపీఎస్ అస్త్రం

### - 18 కేసుల నిందితుడిపై కఠిన చర్యలు

### - 51.915 కిలోల గంజాయి స్వాధీనం: జిల్లా ఎస్పీ



**మదనపల్లె,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న మదనపల్లెకు చెందిన సయ్యద్ సుల్తాన్‌పై 'పిట్ ఎన్‌డీపీఎస్ యాక్ట్' ప్రయోగించినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. జిల్లాలో ఈ చట్టాన్ని ప్రయోగించిన రెండో వ్యక్తి సుల్తాన్ అని వెల్లడించారు. నిందితుడిపై గతంలో 18 క్రిమినల్ కేసులు ఉన్నాయని, అతడి నుంచి మొత్తం 51.915 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం కింద సుల్తాన్‌ను కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు వెల్లడించారు. మాదకద్రవ్యాల విక్రయాలు, అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ధీరజ్ కునుబిల్లి హెచ్చరించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కేసులో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి నగదు రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, సీఐలు రాజారెడ్డి, వెంకటరమణ, ఎస్ఐలు రామకృష్ణారెడ్డి, రహీముల్లా పాల్గొన్నారు.

# విద్యార్థికి కృత్రిమ చేయి ఏర్పాటుకు కృషి



**రామసముద్రం,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రమాదవశాత్తు కుడి చేయి కోల్పోయిన ఎనిమిదో తరగతి విద్యార్థి మహమ్మద్ కుటుంబానికి రామసముద్రం మండల ఉపాధ్యాయులు అండగా నిలిచారు. చికిత్స, భవిష్యత్ అవసరాల కోసం రూ.58 వేల ఆర్థిక సాయం అందించారు. సోమవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి హేమలత చేతుల మీదుగా విద్యార్థి తల్లి షహనాజ్‌కు సాయం అందజేశారు. గడ్డి కత్తిరించే యంత్రంతో జరిగిన ప్రమాదంలో నెల రోజుల క్రితం మహమ్మద్ కుడి చేయి కోల్పోయాడు. ఈ విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు మానవతా దృక్పథంతో స్పందించారు. ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో రూ.35 వేలు, మట్లవారిపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర మండల ఉపాధ్యాయులు కలిసి రూ.23 వేలు సమకూర్చారు. మొత్తం రూ.58 వేలును విద్యార్థి పేరుతో స్థానిక పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మహమ్మద్ భవిష్యత్‌కు అండగా నిలిచేందుకు త్వరలో పుంగనూరు రోటరీ క్లబ్ సహకారంతో ఉచితంగా కృత్రిమ చేయి అమర్చేందుకు కృషి చేస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఉపాధ్యాయులకు మట్లవారిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి, మండల అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి రమాదేవి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు మహీధర్‌రావు, నరసింహులు, మహీధర్‌రెడ్డి, వెంకటరమణ, అన్వర్‌బాషా, సీఆర్పీ దాము పాల్గొన్నారు.

# గిరిజన యువతకు నైపుణ్య శిక్షణకు 20లోగా దరఖాస్తులు

**మదనపల్లె, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లాకు చెందిన గిరిజన నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణకు అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ తెలిపింది. నెల్లూరు జిల్లా వెంకటాచలం వైటీసీలో వసతి, భోజన సౌకర్యాలతో శిక్షణ ఇవ్వనున్నారు. రిటైల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ బయోమెట్రిక్ ఆపరేటర్ కోర్సుల్లో చెరో 30 మందికి అవకాశం ఉంది. 18-35 ఏళ్ల వయస్సు, పదో తరగతి లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత ఉన్న గిరిజన యువత అర్హులు. ఆసక్తి ఉన్నవారు ఆగస్టు 20లోగా దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు 99669 42491 సంప్రదించాలని సూచించారు.

# అక్రమ మట్టి తవ్వకాలకు చెక్



**మదనపల్లె, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె మండలం, అంకిశెట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని భూమలగడ్డ సమీపంలో గుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో రెవెన్యూ, గనుల శాఖ అధికారులు అక్కడికి చేరుకున్నారు. అయితే అధికారులు వచ్చేలోపే మట్టి తరలింపునకు వినియోగిస్తున్న జేసీబీలు, టిప్పర్లు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. అధికారులు స్థానికులను విచారించి మట్టి తరలింపు వ్యవహారంపై వివరాలు సేకరించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా గుట్టలను తవ్వి మట్టి తరలించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. అక్రమ తవ్వకాలు, రవాణాకు పాల్పడుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, రవాణాకు వినియోగించే జేసీబీలు, టిప్పర్లు, ఇతర వాహనాలను సీజ్ చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాల సీజ్‌తో పాటు చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలి

### - జనరేటివ్ కృత్రిమ మేధ, క్వాంటం కంప్యూటింగ్, రోబోటిక్స్‌పై పట్టు సాధించాలి

### - పరిశోధనలు, ప్రయోగాలతో సమస్యలకు పరిష్కారాలు చూపాలి: సుమా వర్గీస్



**మదనపల్లె/ కురబలకోట,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో బీటెక్, బీసీఏ, బీబీఏ మొదటి సంవత్సరం తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ జనరల్, ప్రముఖ శాస్త్రవేత్త సుమా వర్గీస్ విద్యార్థులకు భవిష్యత్ సాంకేతిక రంగాలపై దిశానిర్దేశం చేశారు. విద్యను కేవలం ఉద్యోగం కోసం కాకుండా.. సమస్యలకు పరిష్కారాలు చూపే నైపుణ్యంగా మలచుకోవాలని సూచించారు. జనరేటివ్ కృత్రిమ మేధ, క్వాంటం కంప్యూటింగ్, జీవసాంకేతిక శాస్త్రం, అధునాతన రోబోటిక్స్ వంటి రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని సుమా వర్గీస్ తెలిపారు. ప్రయోగాలు, పరిశోధనలపై దృష్టి సారించి నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని, ఉద్యోగాలు వెతికేవారిగా కాకుండా ఉద్యోగాలు కల్పించే సంస్థలను, సాంకేతిక పరిష్కారాలను సృష్టించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని పిలుపునిచ్చారు. ఫౌండర్ అండ్ చాన్సలర్ డాక్టర్ ఎన్. విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు నాలుగేళ్ల విద్యాభ్యాసం కీలకమన్నారు. మిట్స్‌లోని ఆధునిక ప్రయోగశాలలు, ఉపవిభాగ పట్టాలు, అదనపు క్రెడిట్లు, పరిశ్రమ ఆధారిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆపిల్, మైక్రోసాఫ్ట్, అడోబ్, అమెజాన్ వంటి సంస్థల వృత్తి నైపుణ్య ధ్రువపత్రాలు సాధిస్తూ.. ప్రతి సెమిస్టర్‌కు కనీసం ఒక ధ్రువపత్రం లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. విదేశీ భాషలు, సైబర్ భద్రత, కంప్యూటర్ నెట్‌వర్కింగ్, డ్రోన్లు, రోబోటిక్స్ వంటి ఆధునిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మిట్స్‌లోని 50కిపైగా విద్యార్థి సంఘాలు, క్లబ్‌లను ఉపయోగించుకుని నాయకత్వ లక్షణాలు, సమాచార మార్పిడి నైపుణ్యం, సృజనాత్మకతను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. రహదారి భద్రతా నిబంధనలు పాటిస్తూ మాదకద్రవ్యాలు వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి మిట్స్‌ను మాదకద్రవ్య రహిత ప్రాంగణంగా కొనసాగించేందుకు సహకరించాలని సూచించారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని ఫౌండర్ అండ్ చాన్సలర్ డాక్టర్ ఎన్. విజయభాస్కర్ చౌదరి, డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ జనరల్ సుమా వర్గీస్, ప్రో - చాన్సలర్ ఎన్. ద్వారకానాథ్, ఉపకులపతి డాక్టర్ సి. యువరాజ్, రిజిస్ట్రార్ డాక్టర్ డి. ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రామనాథన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డైరెక్టర్ అడ్మిషన్స్ డాక్టర్ దీపాంకర్ రాయ్, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు మళ్లీ భరోసా

- 'మన మిత్ర' యాప్ ద్వారా కార్మికుల నమోదుకు అవకాశం
- అసెంబ్లీలో మంత్రి వాసంశెట్టి సుభాష్ వివరణ



**అమరావతి, ఆగస్టు 17 (ఆర్‌ఎన్‌ఎ):** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంఖ్య ఎందుకు పెరగడం లేదన్న అంశంపై శాసనసభలో మంత్రి వివరణ ఇచ్చారు. 2018-19 నాటికి రాష్ట్రంలో సుమారు 15 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని మంత్రి తెలిపారు. అయితే గత ప్రభుత్వ హయాంలో 1214 మెమో ద్వారా భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ పథకాలను రద్దు చేయడంతో నమోదు ప్రక్రియ ఒక్కసారిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. 2024లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరించి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గత రెండు నెలల్లోనే 6,777 మంది కార్మికులు కొత్తగా నమోదు చేసుకున్నారని వెల్లడించారు. భవన నిర్మాణ కార్మికులు అంటే కేవలం నిర్మాణ రంగంలో పనిచేసేవారే కాదని మంత్రి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణ పనుల్లో 90 రోజులకు పైగా పనిచేసే కార్మికులు కూడా నమోదు చేసుకునేందుకు అర్హులని, అలాగే మైనింగ్ రంగంలో పనిచేసే కార్మికులు కూడా భవన నిర్మాణ కార్మికుల పరిధిలోకి వస్తారని వివరించారు. అర్హులైన కార్మికులు సులభంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం 'మిత్ర' యాప్ ద్వారా కూడా అవకాశం కల్పించిందని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల నుంచి వసూలు చేసే సెస్ మొత్తంలో 10 శాతం నిధులను స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలకు ఖర్చు చేయాల్సి ఉందని మంత్రి పేర్కొన్నారు. అయితే 2019 – 24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సెస్‌లో 10 శాతం నిధులను స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఖర్చు చేయకపోగా, ఆ నిధులను ఇతర అవసరాలకు మళ్లించిందని అసెంబ్లీ వేదికగా మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. కార్మికుల సంక్షేమాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే.. కూటమి ప్రభుత్వం తిరిగి సంక్షేమ పథకాలను పట్టాలెక్కించి, అర్హులైన ప్రతి కార్మికుడికి ప్రయోజనం అందేలా చర్యలు చేపడుతోందని మంత్రి స్పష్టం చేశారు.

# ప్రజల అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి

## పిజిఆర్ఎస్ కు 526 అర్జీలు: జిల్లా జాయింట్ కలెక్టర్

**అనంతపురం, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ పిజిఆర్ఎస్ సమావేశ భవన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రీ డ్రెస్సల్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై పలు సమస్యలతో కూడిన అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ తో పాటు డిఆర్ఓ మాలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్ మల్లికార్జున రెడ్డి, కిరణ్మయి, జిల్లాపౌరసరఫరాల శాఖ మేనేజర్ రమేష్ రెడ్డి ప్రజల నుండిఅర్జీలనుస్వీకరించారు. మొత్తం అర్జీలు 526 కాగా ఇందులో రెవెన్యూ కు సంబంధించి 262 అలాగే 264 దాకా రెవెన్యూ క్లినిక్ అర్జీలు వచ్చాయి. అధికారులను ఉద్దేశించిజిల్లాజాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని విడనాని సదరు అర్జీలకు సంబంధించిన ఆడిట్ కు ప్రాధాన్యతగా పూర్తి చేయాలని ఇందులో నాణ్యతతో కూడిన చర్యలను చేపట్టి బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా ఆయా సమస్యలనునిర్ణీతసమయంలో అర్జీల సమస్యలను బాధ్యత తో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆయా శాఖల అధికారుల నుఆదేశించారు. వివిధ సమస్యలపై స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలు పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించే అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్మెంట్ ఇచ్చి అర్జీదారుల్లో భరోసా కల్పించాలని తెలిపారు. అర్జీలు పదే పదే రీ ఓపెన్ కి తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు ఇచ్చిన ప్రతి విజ్ఞప్తిని సకాలంలో పరిష్కరించడం ద్వారా ప్రజలకు అధికారులపై విశ్వాసం కలుగుతుందన్నారు. సీ.ఎమ్.ఓ కార్యాలయం మరియు ప్రజా ప్రతినిధుల ద్వారా వచ్చిన అర్జీలను కూడా సత్వరమే పారదర్శకంగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి సాలు రెడ్డి, జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డి ఆర్ డి ఏ పి డి శైలజ, డ్వామా పిడి సలీం భాష, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

## జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్

**పుట్టపర్తి, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్ స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటి ఫలాలు అర్హులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# రాజమహేంద్రవరంలో విషాద ఘటన

- గోదావరిలోకి దూకి ఎఇ కుటుంబం ఆత్మహత్య
- ముగ్గురు మృతి, ఒకరు సురక్షితం

**రాజమహేంద్రవరం,ఆగస్టు17(ఆర్ఎన్ఎ):** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. నగరంలోని రోడ్డు కమ్ రైలు వంతెన పైనుంచి ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పిఠాపురానికి చెందిన ఏఈ కుటుంబం గోదావరిలోకి దూకింది. ఏఈ నూకరాజు, ఆయన భార్య, కుమార్తె, మనవడు నీటిలోకి దూకారు. మనవడు ప్రాణాలతో బయటపడగా.. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మిగతా వారి కోసం పోలీసులు, అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. పిఠాపురంలో పంచాయతీరాజ్ ఏఈగా నూకరాజు పనిచేస్తున్నారు. ఈ ఘటనకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నదిలోకి దూకేముందు నూకరాజు మరణ వాంగ్మూలం రాసి స్నేహితులు, అధికారుల గ్రూప్‌లో పోస్టు చేశారు. కాకినాడ రైఫిల్ షూటింగ్ ఆర్గనైజర్ షేక్ సాధిక్ ఖాన్ వేధింపుల కారణంగానే తమ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు నూకరాజు సూసైడ్ లెటర్‌లో పేర్కొన్నారు. తన అల్లుడు ఈ ఏడాది జులైలో మరణించిన తర్వాత కుమార్తెను షేక్ సాధిక్ ఖాన్ వేధిస్తున్నాడని వెల్లడించారు. ఆ వ్యక్తి కారణంగా తన కుమార్తెకు, మనవడికి ప్రాణహాని ఉందని.. ఈ కారణంతోనే తాము ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తెలిపారు. కాకినాడ నాగమల్లి తోట జంక్షన్ వద్ద ఏఈ కుటుంబం నివాసం ఉంటోంది. ఆదివారం కాకినాడ నుంచి రాజమహేంద్రవరానికి కారులో నూకరాజు కుటుంబం బయలుదేరింది. కొవ్వూరు వంతెన వద్ద డ్రైవర్‌ను దించి నూకరాజు కుటుంబం కారులో వెళ్లింది. రోడ్ కమ్ రైలు బ్రిడ్జిపై కారు ఆపి వంతెనపై నుంచి నూకరాజు కుటుంబం దూకింది. నీటిలో కొట్టుకు వస్తున్న నూకరాజు మనవడు పదేళ్ల రియాన్ష్ కార్తికేయను జాలర్లు ఒడ్డుకు తీసుకువచ్చారు. గల్లంతైన నూకరాజు(61), భార్య మీనా (59), కుమార్తె సౌజన్య(34) కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## ఎఇ కుటుంబం ఆత్మహత్య పవన్ విచారం

### ఘటనపై ఎస్పీలతో మాట్లాడిన డిప్యూటి సిఎం

**అమరావతి,ఆగస్టు17(ఆర్ఎన్ఎ):** రాజమహేంద్రవరం సమీపంలో పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ నూకరాజు కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. గల్లంతైన వారిని గుర్తించి, రక్షించేందుకు యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. అవసరమైతే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సేవలను వినియోగించాలని సూచించారు. ఈ ఘటనకు సంబంధించి తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడారు. ఏఈ కుటుంబంతో సహా ఆత్మహత్యాయత్నానికి దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, ఇందులో ఎవరైనా బాధ్యులుగా తేలితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటన నుంచి బయటపడిన నూకరాజు మనుమడి ఆరోగ్య పరిస్థితి వివరాలను కూడా పవన్ అడిగి తెలుసుకున్నారు. బాలుడికి అవసరమైన వైద్య సాయం అందించి పూర్తి స్థాయిలో కోలుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సమస్యకు పరిష్కార మార్గం ఉంటుందని, క్షణికావేశం, మానసిక ఒత్తిడికిలోనై ఎవరూ ప్రాణాలు తీసుకునే నిర్ణయాలు తీసుకోవద్దని పవన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇబ్బందులు ఎదురైనప్పుడు తక్షణమే పోలీసులు, సంబంధిత అధికారులను సంప్రదించి చట్టపరమైన సహాయం పొందాలన్నారు.

# రూ.500 కోట్లతో ఎంజేపీలకు శాశ్వత భవనాలు

- రూ.80 కోట్లతో అసంపూర్తి ఎంజేపీల నిర్మాణం
- సీఎస్ఆర్, డీఎంఎఫ్ ఫండ్స్‌తో బీసీ హాస్టళ్ల అభివృద్ధి
- శిథిలమైన హాస్టళ్లను వేరే భవనాల్లో షిఫ్ట్ చేస్తున్నాం: మంత్రి సవిత



**అమరావతి, ఆగస్టు 17(ఆర్ఎన్ఏ):** రూ.500 కోట్ల సాస్కి నిధులతో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయించామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, మరమ్మతులకు నిధులు కేటాయించామని తెలిపారు. వర్షా కాల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మొదటిరోజు సోమవారం శాసనసభలో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సవిత సమాధానాలిచ్చారు. నాణ్యమైన విద్యను అందిస్తున్న బీసీ గురుకులాలకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ బీసీ గురుకులాల భవనాలు నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఈ ఏడాది కొత్తగా 10 బీసీ గురుకులాలు స్థాపించామని, వాటిలో 5 రాయలసీమలో, మరో 5 ఉత్తరాంధ్రలో నెలకొల్పామని తెలిపారు. ఆరు బీసీ బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. బీసీ బాలికల డ్రాపౌట్ల నివారణకు జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. 50 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న బీసీ హాస్టళ్లను గురుకులాల్లో విలీనం చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తరవాత ఏపీలో 32 బీసీ గురుకులాలు మాత్రం ఉన్నాయని, 2014-19 మధ్య 75 బీసీ గురుకులాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారని మంత్రి సవిత గుర్తు చేశారు. వాటిలో 25 ఎంజేపీలకు శాశ్వత భవనాల కోసం రూ.40 కోట్లను ఆనాడు మంజూరుచేయగా, 70 నుంచి 80 శాతం మేర పనులు సైతం పూర్తయ్యాయని అన్నారు. తరవాత వచ్చిన ప్రభుత్వం బీసీ గురుకులాలను పట్టించుకోకుండా గాలి కొదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసంపూర్తి గా నిలిచిపోయిన భవనాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. గోనబావి, మడకశిర, రొద్దం, పులివెందుల సహా పలు ప్రాంతాల్లో ఉన్న గురుకులాల పనులు పున:ప్రారంభించామని, త్వరలోనే వాటిని పూర్తి చేసి బీసీ బిడ్డలకు అంకితం చేస్తామని తెలిపారు. బీసీ హాస్టళ్లలో 90,676 మంది విద్యార్థులు చదువుతున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హాస్టళ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి సవిత తెలిపారు. సీఎస్ఆర్, డిస్ట్రిక్ మినరల్ ఫండ్స్ ద్వారా హాస్టళ్ల మరమ్మతులు చేపట్టామన్నారు. పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న హాస్టళ్లను వేరే భవనాల్లోకి షిఫ్ట్ చేశామన్నారు. మరికొన్నింటిని గుర్తించామని, వాటిని కూడా త్వరలో షిఫ్ట్ చేస్తామని తెలిపారు. హాస్టళ్లలో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్య ఇస్తున్నామని, సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, ఇనర్వర్టర్లు, దోమ తెరలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ విధానం ప్రవేశపెట్టి వార్డెన్లు, విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగు పరిచామన్నారు. హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణకు 1,291 మంది పారిశుధ్య సిబ్బందిని, 142 మంది కుక్, కమాటీలను నియమించామని తెలిపారు. 2026-27 బడ్జెట్ లో హాస్టళ్ల మరమ్మతులకు రూ.20 కోట్లు కేటాయించామన్నారు. 2019-24 మధ్య ఆనాటి ప్రభుత్వం హాస్టళ్ల కనీస మరమ్మతులకు, వసతులకు నిధులు కూడా కల్పించలేదని మంత్రి సవిత తెలిపారు. రూ.9.75 కోట్లతో భీమిలి బీసీ గురుకుల పాఠశాలకు అదనపు భవనం నిర్మిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. ఈ భవనానికి సంబంధించి అంచనాలు కూడా ఇప్పటికే రూపొందించామని, అనుమతులు రాగానే నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో భీమిలి ఎంజేపీ సహా 70 నుంచి 80 శాతం మేర అసంపూర్తి గా నిలిచిపోయిన ఎంజేపీ భవనాల నిర్మాణాల పూర్తికి కూటమి ప్రభుత్వం రూ.80 కోట్లు కేటాయించిందన్నారు. ఆరు నెలల్లో ఈ ఎంజేపీ భవనాలను బీసీ బిడ్డలకు అంకితం చేస్తామని మంత్రి సవిత తెలిపారు.

# 16 ఏళ్ల వయసులో లక్ష్మణన్ సిఏ పూర్తి

## భారతీయ టీనేజర్ గిన్నిస్ రికార్డు

**న్యూఢిల్లీ,ఆగస్టు17(ఆర్ఎన్ఎ):** పదహారేళ్ల వయసులో టీనేజర్లు తాము ఏ రంగాన్ని ఎంచుకోవాలో తెలియక మల్లగుల్లాలు పడుతుంటారు. కానీ ఓ భారతీయ టీనేజర్ మాత్రం తనకు నచ్చిన రంగాన్ని ఎంచుకోవడమే కాకుండా అందులో గిన్నిస్ రికార్డు కూడా సృష్టించాడు. ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్న లక్ష్మణన్ మేయప్పన్ అత్యంత పిన్నవయస్కుడైన సీఏగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తాజాగా చోటు సంపాదించాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అతడికీ అరుదైన గుర్తింపు లభించింది. ప్రస్తుతం మేయప్పన్ సెంచరీ ఫైనాన్షియల్ అనే సంస్థలో సీనియర్ ఫైనాన్షియల్ రీసెర్చ్ ఎనలిస్టుగా ఉన్నాడు. అతడి అసాధారణ ప్రజ్ఞ గురించి కంపెనీ స్వయంగా ప్రకటించింది. కొవిడ్ సమయంలో అకౌంటింగ్‌పై మేయప్పన్‌కు మక్కువ ఏర్పడింది. స్వయంగా సీఏ అయిన అతడి తల్లి అకౌంటింగ్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలను తనయుడికి పరిచయం చేయడంతో ఆసక్తి ఏర్పడింది. దీంతో, తాను ఏసీసీఏ పరీక్షలు పాసై సీఏ కావాలని నిర్ణయించుకున్నాడు. 10వ తరగతి పరీక్షల తరువాత ఏడాది పాటు కష్టపడి 2021లో ఏసీసీఏ (అసోసియేషన్ ఆఫ్ చార్టెడ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్) పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. కేవలం 16 ఏళ్ల 141 రోజులు చిరు ప్రాయంలోనే చార్టెడ్ అకౌంటెంట్‌గా మారాడు. తనకు గిన్నిస్ రికార్డుల్లో చోటు దక్కడంపై మేయప్పన్ హర్షం వ్యక్తం చేశాడు. 'ఇది నాకెంతో విలువైనది. చదువు అనేది నేనెప్పుడు ఒక రేసులా భావించలేదు. ఆర్థికరంగాన్ని అర్థం చేసుకునేందుకే ప్రాధాన్యం ఇచ్చాను. అన్ని కాలాలకు అనువైన నైపుణ్యాలను నేర్చుకోవడంపై దృష్టిపెట్టాను. ఆసక్తితో ఏదైనా నేర్చుకుంటే ఫలితాలు అర్థవంతంగా ఉంటాయి' అని అన్నాడు. భారత్‌లో సీఏ పరీక్షలకు హాజరయ్యేందుకు కనీసం 12వ తరగతి పాసై ఉండాల్సిన విషయం తెలిసిందే. అయితే, బ్రిటన్‌కు చెందిన అసోసియేషన్ ఆఫ్ చార్టెడ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ) పరీక్షకు హాజరయ్యేందుకు కనీస విద్యార్హత 10వ తరగతే. ఏసీసీఏకు మొత్తం 180 దేశాల్లో గుర్తింపు ఉంది.

# సుప్రీంలో రాహుల్‌కు ఊరట

## ఆదాయాన్ని మించిన ఆస్తుల కేసులో విచారణ నిలిపివేత

**న్యూఢిల్లీ,ఆగస్టు17(ఆర్ఎన్ఎ):** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టులో కొనసాగుతున్న విచారణను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిలిపివేయాలని ఆదేశించింది. అలాగే ఈ కేసులో సీబీఐ, ఈడీ ఎలాంటి నివేదికను ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టుకు సమర్పించకూడదని స్పష్టం చేసింది. రరాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అలహాబాద్ హైకోర్టు ఇప్పటికే ఈ కేసులో తదుపరి విచారణను ఆగస్టు 20న చేపట్టనుంది. అయితే హైకోర్టు విచారణను తదుపరి ఆదేశాల వరకు వాయిదా వేయాలని తాజాగా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమ దర్యాప్తు లేదా పరిశీలనకు సంబంధించిన ఎలాంటి నివేదికను హైకోర్టుకు సమర్పించకుండదని పేర్కొంది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేష్ శిశిర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ వ్యవహారం అలహాబాద్ హైకోర్టుకు వెళ్లింది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలను పరిశీలించాలని సీబీఐ, ఈడీకి హైకోర్టు గతంలో సూచించింది. ఈ ఆదేశాలను రాహుల్ గాంధీ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అంతేకాకుండా ఈ కేసు విచారణను అలహాబాద్ హైకోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రత్యేక పిటిషన్ కూడా దాఖలు చేశారు.

# విద్యార్థులను కలవండి.. చర్చించండి

## జార్ఖండ్ సిఎం సోరెన్‌కు రాహుల్ లేఖ

**న్యూఢిల్లీ,ఆగస్టు17(ఆర్ఎన్ఎ):** జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను స్వయంగా కలిసి వారి సమస్యలను వినాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కోరారు. ఈ మేరకు ఆగస్టు 14న సోరెన్‌కు రాహుల్ గాంధీ లేఖ రాశారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీక్, నియామక పక్రియలో పారదర్శకత లోపించిందంటూ విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. రాంచీలో కొనసాగుతున్న ఈ నిరసనలు సోమవారం నాటికి 24వ రోజుకు చేరుకున్నాయి. విద్యార్థుల ఆందోళన ఇప్పటివరకు శాంతియుతంగానే సాగుతోందని, వారి డిమాండ్లు న్యాయమైనవని రాహుల్ గాంధీ తన లేఖలో పేర్కొన్నారు. గత కొన్ని నెలలుగా దేశవ్యాప్తంగా ప్రశ్నపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. జార్ఖండ్‌లోని పరిస్థితి మరింత తీవ్రతరం కాకుండా చూడటానికి ముఖ్యమంత్రి స్వయంగా విద్యార్థులను కలిసి వారి ఆందోళనలను వినాలి. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలి' అని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు.

# టివికె మంత్రుల అవినీతి బాగోతం

## లంచాలు డిమాండ్ చేస్తున్నారన్న అన్నామలై

**చెన్నై,ఆగస్టు17(ఆర్ఎన్ఎ):** తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ప్రభుత్వంపై మాజీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ టెండర్లు దక్కించుకునే కాంట్రాక్టర్ల నుంచి కొందరు మంత్రులు కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆడియో రికార్డులు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అన్నామలై తాజా వ్యాఖ్యలు తమిళనాడు రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించాయి. చెన్నైలో నిర్వహించిన పర్యావరణ అవగాహన కార్యక్రమంలో అన్నామలై పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి విజయ్ అవినీతికి వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరితో ఉన్నారని, కానీ కొందరు మంత్రుల వ్యవహారశైలి అందుకు విరుద్ధంగా ఉందని ఆరోపించారు. గతంలో కీలక టెండర్ల విషయంలో కమిషన్ల డిమాండ్లు లేవని, ఇప్పుడు కొందరు మంత్రులు కాంట్రాక్టర్ల నుంచి వాటాలు అడుగుతున్నారని విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో తాము డబ్బులు ఖర్చు చేశామని చెబుతూ.. కాంట్రాక్టర్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నామలై ఆరోపించారు. రెండు శాతం ఇవ్వాలని, మూడు శాతం ఇవ్వాలని, అవసరమైతే నాలుగు శాతం ఇవ్వాలని అడుగుతున్నట్లుగా ఆడియో రికార్డులు తన వద్ద ఉన్నాయని అన్నారు. సందర్భంగా మంత్రులు, ఉన్నతాధికారులపై ముఖ్యమంత్రి విజయ్ మరింత నిఘా పెట్టాలని అన్నామలై సూచించారు. ప్రభుత్వం అవినీతి రహిత పాలనను లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు, కిందిస్థాయిలో జరుగుతున్న అక్రమాలపైనా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, విజయ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలానికే అవినీతి ఆరోపణలు రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



# బెంగాల్ తారాపీఠ్ హోటల్‌లో మంటలు

- మంటలు క్షణాల్లో వ్యాపించడంతో ఏడుగురు మృతి
- నిద్రలో ఉండగా తెల్లవారు జామున ప్రమాదం

**కోల్‌కతా,ఆగస్టు17(ఆర్ఎన్ఎ):** పశ్చిమ బెంగాల్ లోని బీర్‌భూమ్ జిల్లా తారాపీఠ్‌లో ఒక హోటల్‌లో మంటలు చెలరేగడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం తెల్లవారుజామున గ్రౌండ్‌ఫ్లోర్‌లోని హోటల్ రిసెప్షన్‌లో ఈ మంటలు మొదలయ్యాయి. క్షణాల్లోనే భవనమంతా వ్యాపించాయి. అప్పుడు అతిథులంతా నిద్రలో ఉన్నారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. ఓ నాలుగు అంతస్తుల హోటల్ భవనంలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ఏడుగురు సజీవ దహనం కాగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో హోటల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఏసీ యూనిట్లలో సాంకేతిక లోపం కారణంగా మంటలు వ్యాపించాయి. భారీగా మంటలు చెలరేగడంతో గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం క్షణాల్లోనే పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న సహాయక బృందాలు.. స్థానికులతో కలిసి రక్షణ చర్యలు చేపట్టారు. ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేసి మృతులను, గాయపడిన వారిని రాంపూర్‌హాట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, బాధితులంతా ప్రసిద్ధ కాళీ ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులుగా తెలుస్తోంది. అగ్నిప్రమాద ఘటనపై కోల్‌కతాకు చెందిన ఓ బాధిత మహిళ అతిథి స్పందించారు. హోటల్ మొత్తం పొగతో నిండిపోయిందని, దాని వల్ల చాలా మంది తప్పించుకోలేక పోయారని తెలిపారు. అలాగే, పలువురు శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బంది పడ్డారని వెల్లడించారు. బయటకు వచ్చేందుకు దారీ కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హోటల్‌లో కనీస అగ్నిమాపక భద్రతా చర్యలు లేవని ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. ఫైర్ అలారం కూడా పనిచేయలేదని పేర్కొన్నారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఆటో డ్రైవర్ ఇంట్లో డబ్బుల మూటలు

- ఆయుధాల కోసం వెతికితే పట్టుబడ్డ నగదు
- రూ.3 కోట్లుగా స్వాధీనం చేసుకున్న పోలీసులు

**భోపాల్,ఆగస్టు17(ఆర్ఎన్ఎ):** ఓ ఆటో డ్రైవర్ ఇంట్లో రూ.3 కోట్లు లభ్యమైన ఘటన మధ్యప్రదేశ్‌లోని సాగర్‌లో చోటుచేసుకుంది. ఆటో డ్రైవర్ ఇంట్లో మారణాయుధాలు ఉన్నాయని సమాచారం రావడంతో పోలీసులు సోదా చేసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున నగదు సంచులు కనిపించడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. దాదాపు ఐదు గంటల పాటు శ్రమించి నగదును లెక్కించారు. అనంతరం దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాగర్‌లోని గోపాల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్ రాజేశ్ అహిర్వార్ తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతని కుమారుడు సౌరభ్ అహిర్వార్ ఇటీవల సోషల్ మీడియాలో ఓ ఫొటోను షేర్ చేశాడు. తుపాకీతో దిగిన ఆ ఫొటో స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. అతని వద్ద మారణాయుధాలు ఉన్నాయనే ప్రచారం జోరుగా సాగింది. దీంతో విషయం పోలీసులకు చేరింది. ఆటో డ్రైవర్ ఇంట్లో ఆయుధాలు ఉన్నాయన్న కారణంతో వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడి ఇంటికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఎంత వెతికినా ఆయుధాలు లభించలేదు. అయితే, పెద్దఎత్తున నగదు సంచులు బయటపడ్డాయి. ఆటో డ్రైవర్ ఇంట్లో ఇంత పెద్దమొత్తంలో నగదు కనిపించడంతో పోలీసులు షాక్ అయ్యారు. వెంటనే నగదు లెక్కించే యంత్రాలను తెప్పించారు. సుమారు ఐదు గంటల పాటు శ్రమించి దాని విలువ రూ.3 కోట్లుగా తేల్చి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈ నగదు ఎక్కడి నుంచి వచ్చిందని ఆటో డ్రైవర్ కుటుంబాన్ని పోలీసులు ప్రశ్నించారు. అయితే, ఆ డబ్బుతో తమకు ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు. భోపాల్‌లో ప్రభుత్వ ఇంజనీర్‌గా పనిచేస్తున్న తమ బంధువు కుటుంబ సభ్యులదని వెల్లడించారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఉప్పల్ పరిధిలో మెడికో ఆత్మహత్య

## యువకుడి మృతితో కుటుంబంలో విషాదం

**హైదరాబాద్,ఆగస్టు17(ఆర్ఎన్ఎ):** హైదరాబాద్‌లోని ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న కె. భరద్వాజ్ రెడ్డి(18) మెడికో నిర్మాణంలో ఉన్న ఒక భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెడికో బలవన్మరణానికి గురికావడంతో ఆయన కుటుంబంలో, ఉస్మానియా మెడికల్ కాలేజీలో తీవ్ర శోకఛాయలు అలముకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. భరద్వాజ్ రెడ్డి తెల్లవారుజామున 3:20 గంటల ప్రాంతం నుంచి కనిపించకుండా పోయాడు. అతను ఇంట్లో కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఎంత వెతికినా అతని ఆచూకీ లభించక పోవడంతో కుటుంబ సభ్యులు ఆవేదనకు గురయ్యారు. ఉదయం 8:30 గంటల సమయంలో స్థానికులు డయల్-100కు సమాచారం అందించడంతో ఉప్పల్ పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిర్మాణంలో ఉన్న భవనం కింద తీవ్ర గాయాలతో పడి ఉన్న భరద్వాజ్ రెడ్డి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# రిటైర్‌మెంట్ డబ్బులపై భార్యాభర్తల గొడవ

## భర్తను రోకలిబండతో కొట్టి చంపిన భార్య

**సిద్దిపేట,ఆగస్టు17(ఆర్ఎన్ఎ):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో దారుణం చోటు చేసుకుంది. రిటైర్మెంట్ డబ్బుల కోసం భర్తను భార్య రోకలిబండతో కొట్టి హతమార్చడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే..స్థానిక హనుమాన్ నగర్‌లో చెందిన వెంకటేశం-రాజమణి దంపతులు నివస్తున్నారు. వెంకటేశం ఆసిఫాబాద్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. రాజమణి ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నది. అయితే ఈ నెలలో వెంకటేశం పదవీ విరమణ చేయాల్సి ఉండగా, రిటైర్మెంట్ డబ్బులు, ఆస్తి విషయంలో దంపతులు గొడవపడ్డారు. ఈ గొడవ పెద్దదిగా మారడంతో ఆగ్రహించిన రాజమణి భర్తను రోకలిబండతో కొట్టి దారుణంగా హతమార్చింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రాజమణిని అదుపులోకి తీసుకున్నారు.

# గోగితా చిక్వాడ్జే దర్శకత్వంలో ..వారణాసి మేకింగ్ వీడియో

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్ కాస్ట్‌తో తెరకెక్కుతున్న ఈ గ్లోబల్ అడ్వెంచర్‌పై రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్‌పై ఓ ఇంట్రెస్టింగ్ విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజమౌళితో పాటు మరో దర్శకుడు కూడా 'వారణాసి' ప్రాజెక్ట్‌లో భాగమయ్యారనే వార్త ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆయన ప్రధాన సినిమాకు దర్శకత్వం వహించడం లేదు. 'వారణాసి' ఎలా రూపుదిద్దుకుంటోంది? రాజమౌళి టీమ్ ఎలాంటి కష్టపడుతోంది? నటీనటులు ఎలాంటి వర్క్‌షాప్స్‌కు హాజరయ్యారు? భారీ సెట్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ఎలా తెరకెక్కుతున్నాయి? వంటి అంశాలను చూపించే ప్రత్యేక మేకింగ్ డాక్యుమెంటరీని రూపొందించే బాధ్యతను ఆయన తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేకింగ్ డాక్యుమెంటరీ కోసం జార్జియాకు చెందిన దర్శకుడు గోగితా చిక్వాడ్జేను ఎంపిక చేసినట్లు సమాచారం. డాక్యుమెంటరీ చిత్రీకరణలో అనుభవం ఉన్న ఆయన.. 'వారణాసి' ప్రీ-ప్రొడక్షన్ దశ నుంచే తన కెమెరాలతో ఈ ప్రయాణాన్ని రికార్డ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నటీనటుల వర్క్‌షాప్స్, పాత్రల కోసం వారు చేస్తున్న ప్రత్యేక శిక్షణ, భారీ సెట్స్ నిర్మాణం, షూటింగ్ ప్రక్రియ, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ వంటి అనేక కీలక అంశాలను ఈ డాక్యుమెంటరీలో చూపించనున్నట్లు సమాచారం. సాధారణంగా సినిమా విడుదలకు ముందు లేదా షూటింగ్ చివరి దశలో మేకింగ్ వీడియోలను రూపొందిస్తుంటారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం సినిమా రూపకల్పన ప్రారంభమైనప్పటి నుంచే మేకింగ్‌ను డాక్యుమెంట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రాజమౌళి ఆలోచనా విధానం, ప్రీ-ప్రొడక్షన్‌లో ఆయన చేసే ప్లానింగ్, నటీనటుల ప్రిపరేషన్, భారీ స్థాయిలో విజువల్స్‌ను రూపొందించే విధానం వంటి విషయాలను ప్రేక్షకులు మరింత దగ్గరగా చూసే అవకాశం ఉంటుంది. రాజమౌళి సినిమాల మేకింగ్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. 'బాహుబలి' చిత్రానికి సంబంధించిన మేకింగ్ కంటెంట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే 'ఆర్‌ఆర్‌ఆర్'కు సంబంధించిన మేకింగ్ వీడియోలు, షూటింగ్ విశేషాలు కూడా సోషల్ మీడియాలో భారీగా వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో 'వారణాసి' మేకింగ్ డాక్యుమెంటరీని మరింత భారీ స్థాయిలో రూపొందిస్తు న్నట్లు తెలుస్తోంది. సినిమా వెనుక ఉన్న అసలు శ్రమను, రాజమౌళి విజన్‌ను, అంతర్జాతీయ స్థాయిలో ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్న విధానాన్ని ఇందులో చూపించనున్నట్లు సమాచారం. 'వారణాసి' కేవలం భారతీయ మార్కెట్‌ను మాత్రమే కాకుండా అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్న సినిమా కావడంతో.. మేకింగ్ డాక్యుమెంటరీకి కూడా గ్లోబల్ స్థాయిలో మంచి డిమాండ్ ఏర్పడే అవకాశం ఉందని చిత్ర వర్గాలు భావిస్తున్నట్లు టాక్. సినిమా డిజిటల్ హక్కులతో పాటు మేకింగ్ డాక్యుమెంటరీని కూడా ప్యాకేజీలో భాగంగా చేసే ఆలోచనపై చర్చలు జరుగుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.







## రాముడి సుగుణాలు కనిపించాలంటే రావణుడి పాత్ర బలంగా ఉండాల్సిందే: యశ్



కన్నడ స్టార్ యశ్ ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'రామాయణ' గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. రావణుడి పాత్రకి ఎందుకు ఓకే చెప్పారో వెల్లడించగా.. ఆ సమాధానం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. రాముడి మంచితనాన్ని, సుగుణాలను చూపించాలంటే రావణుడి పాత్రలో బాగా నటించాలి. నేను విలన్ పాత్రలకు న్యాయం చేయగలను. మంచి పాత్రలు చేసినా నావంతు ప్రయత్నం తప్పకుండా చేస్తాను. 'రామాయణ' కోసం మేమంతా ఇగోని పక్కన పెట్టాం. బెస్ట్ టీమ్‌తో కలిసి పనిచేస్తున్నాం. రామాయణం గురించి ప్రతి ఒక్కరికీ తెలిసే ఉంటుంది. నేను చిన్నప్పుడు మా తాత చెబితే ఒకలాగా ఊహించుకునే వాడిని. టీవీలో, సినిమాల్లో చూసిన తర్వాత ఆ ఊహ మారింది. అందరికీ తెలిసిన కథైనప్పటికీ దాన్ని కొత్తగా చూపించగలగాలి. అలా అని మతపరమైన భావాలను దెబ్బతీయకూడదు. ఇది చాలా కష్టమైన పని. నా స్నేహితుడు నమిత్ మల్హోత్రా ఈ సినిమా కోసం బాగా రిస్క్ తీసుకుంటున్నారు. ప్రేక్షకులు దీన్ని ఆదరిస్తారని నమ్ముతున్నానని యశ్ పేర్కొన్నారు. నితీశ్ తివారి దర్శకత్వంలో ముస్తాబైన ఈ బహుభాషా చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించగా.. సీత పాత్రను సాయిపల్లవి పోషించారు. యశ్ ఇందులో రావణుడి పాత్ర పోషిస్తూనే నమిత్ మల్హోత్రాతో కలిసి నిర్మించారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 'రామాయణ: పార్ట్ 1' ఈ దీపావళికి విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఇటీవల ట్రైలర్‌ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇక, యశ్ మరో సినిమా 'టాక్సిక్'.. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ మూవీలో కియారా అడ్వాణీ, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తున్న విశ్వనాథ్ అండ్ సన్స్




సూర్య హీరోగా నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' తెలంగాణ బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా.. తొలి వీకెండ్‌లోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా నైజాం ఏరియాలో ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. వీకెండ్‌లో భాగంగా ఆదివారం మూడో రోజు నైజాం ప్రాంతంలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ.5.2 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. దీంతో తొలి మూడు రోజుల్లో నైజాంలో ఈ సినిమా మొత్తం రూ.14 కోట్ల గ్రాస్ మార్కును అందుకుంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ స్థాయి వసూళ్లు రావడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా ఈ చిత్రానికి అత్యుత్తమంగా స్పందించిన ప్రాంతంగా నైజాం నిలిచినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వీకెండ్‌లో భారీ వసూళ్లు సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. సోమవారం నాటికి జీఎస్టీ మినహాయించి బ్రేక్ ఈవెన్ టా÷-గర్గ÷ట్‌ను అందుకునే అవకాశం ఉందని సమాచారం. ఇదే జోరు వర్కింగ్ డేస్‌లోనూ కొనసాగితే నైజాం డిస్ట్రిబ్యూటర్లకు మంచి లాభాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథ, సూర్య నటన, వెంకీ అట్లూరి దర్శకత్వం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. విడుదలకు ముందు ఉన్న అంచనాలకు తగ్గట్టుగానే సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంటోంది. దీంతో రోజురోజుకూ థియేటర్లలో ఆక్యుపెన్సీ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటించారు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. మొత్తానికి తొలి మూడు రోజుల్లోనే నైజాంలో రూ.14 కోట్ల గ్రాస్ సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. రాబోయే రోజుల్లో ఎలాంటి వసూళ్లను నమోదు చేస్తుందో చూడాలి.

## చిరంజీవి పాత్రను ఎలివేట్ చేసేలా బాబీ సినిమా

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీకి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు మెగా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. భారీ యాక్షన్ షెడ్యూల్‌లో భాగంగా కీలకమైన పోరాట సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రామ్,లక్ష్మణ్ మాస్టర్స్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ఫైటర్లతో ఈ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. సినిమాలో యాక్షన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉండటంతో ఈ సన్నివేశాలను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి అభిమానులను ఆకట్టుకునేలా యాక్షన్ ఎపిసోడ్స్‌ను డిజైన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమా నుంచి మరో క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న యాక్షన్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత వచ్చే వారం నుంచి స్పెషల్ సాంగ్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ పాటలో చిరంజీవి పూర్తిగా స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారట. ఈ స్పెషల్ సాంగ్ కోసం మెగాస్టార్ లుక్‌ను ఇప్పటికే లాక్ చేసినట్లు సమాచారం. చిరంజీవి ఎనర్జీకి తగ్గట్టుగా పాటను డిజైన్ చేస్తున్నారని, తెరపై ఆయన స్టైలిష్ అవతార్ అభిమానులను మెస్మరైజ్ చేయడం ఖాయమని చిత్ర వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో చిరంజీవి పాత్రను దర్శకుడు బాబీ చాలా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. మెగాస్టార్ పాత్రలో పలు రకాల వేరియేషన్స్ ఉంటాయని సమాచారం. ఇప్పటివరకు చిరంజీవిని చూడని ఓ కొత్త కోణంలో ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశంతో బాబీ ఈ కథను సిద్ధం చేసినట్లు టాక్. అదే సమయంలో సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కూడా పెద్దపీట వేస్తున్నట్లు తెలుస్తోంది. యాక్షన్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామాతో పాటు చిరంజీవి స్టైల్, కామెడీ, మాస్ ఎలిమెంట్స్‌ను మేళవించి కథను రూపొందిస్తున్నట్లు సమాచారం.



# బిజినెస్ న్యూస్




## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల వేళ.. ఐటీ, ఎఫ్‌ఎంసీజీ స్టాక్స్‌లో అమ్మకాల కారణంగా సూచీలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో సెన్సెక్స్ వరుసగా రెండో సెషన్‌లో నష్టాలు చవిచూడగా.. నిఫ్టీ ఐదో రోజూ నష్టాల్లో ముగిసింది. ఇంట్రాడే కనిష్ఠాల నుంచి సూచీలు కోలుకోవడం ఊరటనిచ్చే అంశం. సెన్సెక్స్ ఉదయం 77,892.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,009.25) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో 77,453.75 వద్ద కనిష్ఠానికి పడిపోయిన సూచీ... చివరికి 281.09 పాయింట్ల పతనమై 77,728.16 వద్ద ముగిసింది. నిఫ్టీ 78.35 పాయింట్లు కోల్పోయి 24,287.65 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.61గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటాస్టీల్, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, బీఈఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్‌అండ్‌టీ, బజాజ్‌ఫైనాన్స్ షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మిగతా కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 89.54 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4,394.13 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## వాట్సప్‌లో పాన్, ఆధార్ వివరాలు.. రిస్క్ కొని తెచ్చుకున్నట్లే!



: రుణాల కోసం బ్యాంకు ఏజెంట్‌ను కలిసినప్పుడు.. పాన్, బ్యాంకు స్టేట్‌మెంట్ వంటి వివరాలు పంపించాలని అడుగుతుంటారు. ఏదైనా హోటల్ గదిలో దిగినప్పుడు ఆధార్ వివరాలు వాట్సప్ చేయాలని కోరుతుంటారు. స్థలం కోసం ఎవరైనా ప్రాపర్టీ బ్రోకర్‌ను కలిసినా కావాల్సిన వివరాలను వ్యక్తిగత నంబర్‌కు వాట్సప్ చేయాలని చెప్తుంటారు. వారు వివరాలు అడగ్గానే.. సులువుగా ఉంది కదా అని మీ వ్యక్తిగత వివరాలను వాట్సప్ చేయడమంటే కోరి రిస్కును కొనితెచ్చుకున్నట్లే. దీనివల్ల వ్యక్తిగత డేటా బహిర్గతం అయ్యే అవకాశం ఉందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సమస్య ఇక్కడే..

ఒకసారి వ్యక్తిగత ధ్రువీకరణ పత్రాలను వాట్సప్ ద్వారా ఇతరులకు పంపినప్పుడు, అవతలి వ్యక్తి వాటిని తమ ఫోన్‌లో లేదా ల్యాప్‌టాప్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటారు. ఆ పత్రాలు ఆటోమేటిక్‌గా వారి క్లౌడ్ బ్యాకప్‌లో సేవ్ అవుతాయి. వాస్తవానికి మోసం చేయాలన్న ఉద్దేశం ఆ వ్యక్తికి లేకపోయినా.. ఎప్పుడైనా ఆ డివైజ్ లేదా వారి ఖాతా సైబర్ దాడికి గురైనప్పుడు మీ డేటా దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంది. రేపొద్దున ఫలానా కంపెనీకి ఆయా వివరాలు పంపినప్పుడు దుర్వినియోగం అయ్యిందని చెప్పడానికీ ఉండదు. ఎందుకంటే మీరు పంపిన డేటా పద్ధతి ఆ కంపెనీకి సంబంధించిన సైబర్ సెక్యూరిటీ పరిధిలోకి రాదనే విషయం గుర్తుంచుకోవాలి.

మరేం చేయాలి?

ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలు అడిగినప్పుడు వాట్సప్ ద్వారా ఎట్టి పరిస్థితుల్లోనూ వివరాలు పంపించొద్దు. కంపెనీ లేదా బ్యాంక్‌కు చెందిన అధికారిక లింక్‌ను లేదా డాక్యుమెంట్ అప్‌లోడ్ చేసే సెక్యూర్ పోర్టల్ లింక్‌ను పంపాలని అడగండి.

బ్యాంకులకు, రుణదాతలకు లేదా హోటల్ వంటి వ్యాపార అవసరాలకు ప్రత్యామ్నాయ వెరిఫికేషన్ పద్ధతులు ఉన్నాయోమో అడిగి తెలుసుకోండి. డిజిలాకర్ లేదా ఉడాయ్‌కి చెందిన ఆఫ్-లైన్ వెరిఫికేషన్ పద్ధతులు అందుబాటులో ఉంటే ఆ రూపంలో మీ వివరాలు ధ్రువీకరించుకోవాలని సూచించొచ్చు.

ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వ్యక్తిగత ఫోన్ నంబర్‌కే పత్రాలను పంపాల్సి వస్తే, ఆ ఫైల్‌ను పాస్‌వర్డ్ ప్రొటెక్ట్‌తో షేర్ చేయడం మంచిది. ఆ పాస్‌వర్డ్‌ను విడిగా తెలియజేయండి. వీలైనంత వరకు ఆధార్‌లోని చివరి 4 అంకెలు మాత్రమే కనిపించే మాస్క్‌డ్ ఆధార్ కాపీలను ఉపయోగించండి.

## వంటగ్యాస్ కొరత రాకుండా చూద్దాం



పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో, సరఫరాలకు ఆటంకాలు ఏర్పడి, మన దేశంలో వంటగ్యాస్ (ఎల్‌పీజీ)కు తీవ్ర కొరత వచ్చి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భవిష్యత్తులో దిగుమతులకు అంతరాయం ఏర్పడినా, దేశీయంగా వంటగ్యాస్ కొరత రాకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపడుతోంది. అందుకే ప్రభుత్వ, ప్రైవేట్ రంగ రిఫైనరీలు, అప్‌స్ట్రీమ్ చమురు కంపెనీలకు తొలిసారిగా 'ఉత్పత్తి లక్ష్యాలను' కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ నిర్దేశించింది. దేశవ్యాప్తంగా ఉన్న 21 రిఫైనరీలు, అప్‌స్ట్రీమ్ కంపెనీలు కలిపి రోజుకు గరిష్ఠంగా 63,810 టన్నుల ఎల్‌పీజీని ఉత్పత్తి చేయగలవు. ఇది 2025-26లో దేశీయంగా జరిగిన ఎల్‌పీజీ ఉత్పత్తి కంటే రెట్టింపు కాగా, దేశ రోజువారీ అవసరాల్లో దాదాపు 70 శాతానికి సమానం. దేశంలో కొరత తలెత్తినప్పుడు ఈ లక్ష్యాలు తక్షణమే అమల్లోకి వస్తాయి. ఇందులో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు అధిక కోటా లభించింది.

ఉత్పత్తి లక్ష్యాలు ఇలా..

రిలయన్స్ ఇండస్ట్రీస్: గుజరాత్ జామ్‌నగర్‌లోని రిలయన్స్ రిఫైనరీకి దేశంలోనే అత్యధికంగా రోజుకు 18,000 టన్నుల ఎల్‌పీజీ ఉత్పత్తి లక్ష్యాన్ని విధించారు. ఎగుమతుల కోసం ఉద్దేశించిన 35.2 మి.టన్నుల సామర్థ్యం కలిగిన యూనిట్‌కు ఎటువంటి లక్ష్యాన్ని పెట్టలేదు.

ప్రభుత్వ రంగ రిఫైనరీలు: ప్రభుత్వ రంగ చమురు సంస్థలకు చెందిన 18 రిఫైనరీలు సంయుక్తంగా రోజుకు 31,470 టన్నుల ఎల్‌పీజీని ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది.

నయారా ఎనర్జీ: వడినార్‌లోని నయారా రిఫైనరీకి రోజుకు 4,480 టన్నుల ఎల్‌పీజీ ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించారు.

అప్‌స్ట్రీమ్ కంపెనీలు: సహజవాయువు, ఎల్‌పీజీని వెలికి తీసే అప్‌స్ట్రీమ్ కంపెనీలైన ఓఎన్‌జీసీ, గెయిల్ సంస్థలకు రోజుకు 6,460 టన్నుల ఉత్పత్తి పరిమితిని కేటాయించారు.

రోజుకు 91,000 టన్నుల వినియోగం 2025-26లో దేశంలో మొత్తం 33.2 మిలియన్ టన్నుల ఎల్‌పీజీ వినియోగమైంది. అంటే రోజువారీ వినియోగం 91,000 టన్నులుగా ఉంది. ఇందులో దేశీయ ఉత్పత్తి 13.1 మి.టన్నులు మాత్రమే. మిగిలిన 21.3 మి.టన్నుల (రోజుకు 58,400 టన్నుల) అవసరాలు దిగుమతుల ద్వారానే తీరాయి. వంటగ్యాస్ అవసరాల్లో దాదాపు 64% దిగుమతులే తీర్చాయి. పశ్చిమాసియా సంక్షోభ సమయంలో పెట్రోరసాయనాల ముడిసరకును ఎల్‌పీజీకి మళ్లించడం, వంటి తాత్కాలిక చర్యలతో ఉత్పత్తిని రోజుకు 55,000 టన్నులకు పెంచగలిగారు.

# 12.5 కోట్ల మంది ప్రయాణించేలా దిల్లీ విమానాశ్రయ విస్తరణ




దేశంలోనే పెద్దదైన దిల్లీ విమానాశ్రయం.. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాబోయే 10 ఏళ్లకు మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తోంది. విమానాశ్రయ వార్షిక ప్రయాణికుల నిర్వహణ సామర్థ్యాన్ని ప్రస్తుత 10.6 కోట్ల నుంచి 12.5 కోట్లకు పెంచేందుకు దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (డయల్) ప్రస్తుతం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం మూడు టెర్మినల్స్ సామర్థ్యం 10.6 కోట్లుగా ఉంది. ఇందులో టీ1 4.2 కోట్లు, టీ2 1.4 కోట్లు, టీ3 టెర్మినల్ 5 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. 2030 ఏప్రిల్ నాటికి ప్రయాణికుల వార్షిక నిర్వహణ సామర్థ్యాన్ని 11.6 కోట్లకు పెంచనున్నారు. 2032కి రెండో దశలో 12.5 కోట్లు చేయనున్నారు. 2036 ప్రణాళికలను భాగస్వాములందరితో చర్చించాక, ఖరారు చేయనున్నారు. టెర్మినల్ 3 వద్ద అదనంగా కోటి మంది ప్రయాణికుల సామర్థ్యంతో కొత్త 'పియర్ ఈ'ని 2030 ఏప్రిల్ నాటికి నిర్మించాలని ప్రతిపాదించారు. టెర్మినల్ 1 నుంచి టీ2, టీ3 మధ్య ప్రయాణికులు సులభంగా రాకపోకలు సాగించేందుకు ప్రతిపాదించిన 7.5 కిలోమీటర్ల ఆటోమేటెడ్ పీపుల్ మూవర్ (ఏపీఎం) వ్యవస్థకు ప్రస్తుతానికి తక్షణ నిర్ణయం తీసుకోకపోయినా, మాస్టర్ ప్లాన్‌లో స్థలాన్ని కేటాయిస్తారు. భవిష్యత్తు అవసరాలు, రద్దీని బట్టి టీ2ని టీ4గా మార్చే అంశాన్ని పరిశీలించనున్నారు. ఈ ఏడాది జులైలో దిల్లీ విమానాశ్రయం నుంచి 60 లక్షల మంది ప్రయాణించారు. 2026-27 ఏప్రిల్-జులై మధ్య 2.64 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలు నమోదయ్యాయి.

## వరసిద్ధుని సేవలో హీరో సాయిధర్మ తేజ్



**కాణిపాకం,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వరసిద్ధ వినాయక స్వామి వారిని సినీ హీరో సాయిధర్మ తేజ్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు శివ ప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు ఉన్నారు.




## శ్రీవారి పుష్కరిణీలో అదనపు ఈవో తనిఖీలు



**తిరుమల,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సెప్టెంబర్ 15 నుండి 23వ తేది వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో శ్రీవారి పుష్కరిణీ మరమ్మతు పనులను సోమవారం టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పుష్కరిణీలో భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా పుష్కరిణీ లోతు తెలిసేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని చెప్పారు. తనిఖీల్లో ఎస్ఈ వేణుగోపాల్, డిప్యూటీ ఈవో భాస్కర్, ఈఈలు సుధాకర్,శ్రీనివాసరావు, డిఈ చంద్ర శేఖర్, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అర్జీదారుల సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపాలి

**- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 224 అర్జీలు**

**- జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**



**తిరుపతి,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు వచ్చిన అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీల ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా పీజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీజిఆర్ఎస్‌లో వచ్చు అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి జి.నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు, భరత్ నాయక్, నాగార్జున, ట్రైని డిప్యూటీ కలెక్టర్. గీతాంజలి లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు.

శాఖల వారీగా అర్జీల వివరాలు:

రెవెన్యూ-143, పోలీస్-20, పంచాయతీ రాజ్-14, సర్వే సెటిల్మెంట్స్, భూ రికార్డులు-10,విద్యుత్ శాఖ -5, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ-5, స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు-4, పౌర సరఫరాలు -3, పురపాలక శాఖ -2, ప్రజారోగ్య శాఖ -2,

గ్రామీణాభివృద్ధి శాఖ -1, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ-1, రహదారులు మరియు భవనాలు-1 ఏపీ క్రీడాసంస్థ -1, తుడా -1, కుటుంబ సంక్షేమ శాఖ-1,

జలవనరుల శాఖ-1, పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఎగుమతుల-1, గృహనిర్మాణ సంస్థ -1,అటవీ శాఖ-1, గనులు మరియు భూగర్భ శాఖ -1, పాఠశాల విద్య-1,ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ-1, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్-1, భూగర్భ జలాలు-1, మత్స్య శాఖ-1 వెరసి మొత్తం 224. అర్జీలు రావడం జరిగిందని సంబంధిత అధికారులు వచ్చిన అర్జీలపై దృష్టి పెట్టి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరైన వివిధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## అన్న క్యాంటీన్లను పరిశుభ్రంగా ఉంచండి: కమిషనర్



**తిరుపతి,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలోని అన్న క్యాంటీన్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఉదయం ఎమ్మార్ పల్లి వద్ద గల నగరంలోని అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలతో కలిసి అల్పాహారం స్వీకరించి, ఆహార నాణ్యతను పరిశీలించి ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీతమ్మ నగర్ రోడ్డు, ఎమ్మార్ పల్లి, న్యూ మారుతీ నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, మంచినీళ్ళ కుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్న కాంటీన్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలకు ఆహార పదార్థాలు స్వీకరించేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. స్వచ్ఛమైన, శుభ్రమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్క టోకెన్ మాత్రమే ఇవ్వాలని సూచించారు. ప్లేట్లు, పాత్రలు శుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆహారం స్వీకరించే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్లు శుభ్రం చేయించాలని తెలిపారు. ఆహార పదార్థాలు వృధా చేయకుండా, తగినంత వడ్డించాలని తెలిపారు. అన్న కాంటీన్లలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని, కాలువల్లో చెత్త లేకుండా తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మంచినీళ్ళ కుంటను అధికారులతో కలిసి పరిశీలించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

## ఆగస్టు 30 నుండి కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్యశాంతి హోమం

**తిరుమల, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 3వ తేదీ వరకు కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్యశాంతి హోమాలను టీటీడీ నిర్వహిం చనుంది. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 32 మంది వేద, శ్రౌత, స్మార్థపండితులు యాగ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సెప్టెంబర్ 3న మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. ధర్మగిరి వేద విజ్ఞన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## ప్రతి ఫిర్యాదుపై విచారించి త్వరితగతిన పరిష్కరించాలి: జిల్లా ఎస్పీ



**తిరుపతి, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 87 పిటిషన్లను స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను అధికారులు ఓర్పుతో ఆలకించి, ప్రతి పిటిషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అందిన ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, అవసరమైన చట్టపరమైన చర్యలను వేగవంతంగా తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి పిటిషన్‌ను వెంటనే సంబంధిత అధికారులకు పంపించి, ప్రాధాన్యత ఆధారంగా విచారణ పూర్తి చేసి నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదని స్పష్టం చేశారు. బాధితులకు సకాలంలో న్యాయం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును చట్టపరంగా, పారదర్శకంగా పరిశీలించి తగిన పరిష్కారం అందించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, వారి సమస్యలకు సత్వర పరిష్కారం కల్పించడం జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీనివాసులు (పరిపాలన), కె.రవి మనోహర్ ఆచారి (శాంతిభద్రతలు), పి.జి.ఆర్.ఎస్. సీఐ సుదర్శనరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

## మన్నెముత్తేరిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**- ఆరుగురి అరెస్ట్ రూ.19 వేలు, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం**



**తిరుపతి,ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లాలో పేకాట, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిరంతరం చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో సుళ్లూరుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్నెముత్తేరి గ్రామంలో పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు దాడి నిర్వహించారు. పోలీసుల దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి పేకాటకు సంబంధించిన రూ.19,000 నగదు, అలాగే 3 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పేకాట, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పోలీసులు స్పష్టం చేశారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, సమాచారం అందిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని తిరుపతి జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేసారు.


## చీకట్లో పేరూరు-చెర్లోపల్లి రోడ్డు

**- వీధి దీపాలు లేక వాహనదారులకు ఇక్కట్లు**



**తిరుపతి సిటీ, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి రూరల్ మండలం పరిధిలోని పేరూరు బస్టాప్ నుంచి చెర్లోపల్లి జంక్షన్ వరకు రహదారి రాత్రి వేళల్లో ప్రమాదకరంగా మారిందని, ఈ మార్గంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు జయ చంద్ర, సుమన్‌లు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం ఆధ్వర్యంలో తిరుపతి రెవిన్యూ డివిజన్ అధికారికి వినతి పత్రం సమర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ జయచంద్ర తిరుపతి రూరల్ కార్యదర్శి కే సుమన్‌లు మాట్లాడుతూ పేరూరు బస్టాప్ నుండి చెర్లోపల్లి జంక్షన్ వరకు రహదారిపై డివైడర్లకు సెంట్రల్ వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళ మొత్తం మార్గం చీకటిమయం అవుతోంది. బెంగళూరు వైపు నుండి చంద్రగిరి మీదుగా తిరుపతికి వచ్చే వాహనాలతో పాటు, తిరుపతి నగరంలో విధులు ముగించుకుని రాత్రి సమయంలో రూరల్ ప్రాంతంలోని గ్రామాలకు వెళ్లే వేలాది మంది ఈ మార్గాన్ని ఉపయోగిస్తున్నారని తెలిపారు. ప్రత్యేకంగా అగ్రికల్చర్ కళాశాల మీదుగా, తాటితోపు మార్గం ద్వారా గ్రామాలకు వెళ్లే ప్రజలు రాత్రివేళ చీకట్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అగ్రికల్చర్ కళాశాల క్యాంపస్ వరకు డివైడర్లపై వీధి దీపాలు ఏర్పాటు చేసినప్పటికీ, అక్కడి నుంచి పేరూరు-చెర్లోపల్లి వైపు ఉన్న సుమారు 2 కిలోమీటర్ల ప్రాంతంలో కూడా సెంట్రల్ డివైడర్లపై వున్న 31 వీధి దీపాలు ఏర్పాటు చేస్తే వేలాది మంది ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చీకటికి తోడు రోడ్డుపై పశువుల సంచార జరుగుతుంది. ఇప్పటికే వీధి దీపాలు లేక చీకటిగా ఉన్న ఈ రహదారిపై పేరూరు గ్రామం నుండి ఆవులు, గేదెలు, మేకలను గుంపులుగా రోడ్డుపైకి తోలుకురావడం మరింత ప్రమాదకరంగా మారుతోందని తెలిపారు చచ్చిన వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.

## గాయకులు డా.సోము ఉమాపతిని సత్కరించిన జిల్లా కలెక్టర్



**తిరుపతి, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటైన సమావేశంలో తెలుగు భాష, జాతీయ జెండాపై ప్రముఖ గాయకులు డా.సోము ఉమాపతి దేశభక్తి పాటలు పాడారు. సోము ఉమాపతి పాడిన దేశభక్తి పాటలకు జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సత్కరించి 'హైటీ' సర్టిఫికేట్‌ను ప్రదానం చేశారు. కన్నుల పండుగగా జరిగిన కార్యక్రమంలో తుడ చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుర్రప్ప, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి నాయకులు నరసింహ యాదవ్ తదితరులు హాజరయ్యారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



**నాయుడుపేట, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ పార్క్ వద్ద మున్సిపల్ కార్మికులు మానవహారం నిర్వహించారు. మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ కార్మికులు,ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం,ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డిపల్లి చెంగయ్య, నాయుడుపేట సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.ముకుంద తదితరులు పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు సెలవులు లేకుండా పట్టణ ప్రజలకు పారిశుధ్యం, చెత్త సేకరణ, డ్రైనేజీ నిర్వహణ తదితర అత్యవసర సేవలను అందిస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యం,పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణను పూర్తిగా ఉపసంహరించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని,సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల వేతనాలు, సేవా పరిస్థితులను మెరుగుపరిచేందుకు 12వ పే రివిజన్ కమిషన్ (పిఆర్‌సి)ను వెంటనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు గ్లౌజులు, మాస్కులు, బూట్లు, యూనిఫాం, ఇతర రక్షణ పరికరాలను క్రమం తప్పకుండా అందించాలని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027